# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

అనునిత్యం ప్రజల పక్షం

TELTEL12273

ఎడిటర్ : పొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ సంపుటి : 2 సంచిక : 181 మంగళవారం 6 - 08 - 2024 పేజీలు : 08 వెల : 5



విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలవడుతున్న
తెలంగాణ ముచ్చట్లు దిన పత్రికలో
పనిచేయుటకు జిల్లా బ్యూరో , స్టాఫ్ రిపోర్టర్లు,
నియోజకవర్గ ఆర్.సి.లు, మండల స్థాయి రిపోర్టర్లుగా
పనిచేయుటకు ఆసక్తి, ఉత్సాహం కలిగిన
యువతి యువకులు కావలెను.
సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వబడును.

9493669669, 9391230209





## స్కిల్ వర్సిటీ చైర్మన్‌గా ఆనంద్ మహీంద్రా

- స్కిల్ వర్సిటీ ఏర్పాటు ద్వారా నైపుణ్య శిక్షణ
- హైదరాబాద్‌ను ప్రపంచంలోనే అగ్రగామిగా నిలుపుతాం
- ప్రవాసాంధ్రులతో ముఖాముఖిలో సిఎం రేవంత్ రెడ్డి

మిగతా 3లో...

## కేజ్రీవాల్‌కి దక్కని ఊరట

▶▶ బెయిల్ పిటిషన్‌ని కొట్టేసిన ఢిల్లీ హైకోర్టు




ఢిల్లీ, తెలంగాణ ముచ్చట్లు : ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో జైలు శిక్ష అనుభవి స్తున్న సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కి షాక్ తగిలింది. ఢిల్లీ హైకోర్టులో ఆయన వేసిన బెయిల్ పిటిషన్‌పై విచారించిన ధర్మాసనం పిటిషన్‌ని కొట్టేసింది. దీంతో బెయిల్ పై ఆశలు పెట్టుకున్న కేజ్రీవాల్‌కి ఊరట దక్కలేదు. ఈఘటనను చట్ట విరుద్ధమైన అరెస్టు అని చెప్పలేమని జస్టిస్ నీనా బన్సల్ కృష్ణతో కూడిన ధర్మాసనం పేర్కొంది. బెయిల్ దరఖాస్తు కోసం కేజ్రీవాల్ ట్రయల్ కోర్టును ఆశ్రయించే స్వేచ్ఛ ఉందని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది.

**పిటిషన్లో ఏముందంటే..**

లిక్కర్ కేసులో అవినీతి జరిగిందంటూ సీబీఐ తనను అరెస్టు చేయడాన్ని సవాలు చేస్తూ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ హైకోర్టులో పిటిషన్ వేశారు. కేజ్రీవాల్ తరఫున సీనియర్ న్యాయవాదులు అభిషేక్ మను సింఘ్వీ, ఎన్ హరిహరన్, రమేష్ గుప్తా వాదనలు వినిపించారు.

మిగతా 2లో...



## వయనాడ్ విషాదానికి కారణమదే

న్యూఢిల్లీ తెలంగాణ ముచ్చట్లు : వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడి జరిగిన భారీ ఉత్పాతం, ప్రాణ నష్టంపై విమర్శలు, ప్రతి విమర్శలు కొనసాగుతున్నాయి. ముందస్తు హెచ్చరికలను కేరళ సర్కార్ పట్టించు కోలేదని కేంద్ర అమిత్‌షా ఇటీవల పార్లమెంటులో చేసిన ప్రకటనను ఆ రాష్ట్ర ముఖ్య మంత్రి పినరయి విజయన్ నిర్ద్వంద్వంగా తోసిపుచ్చారు. ఈ క్రమం లోనే కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ సోమవారం నాడు మరో

## పంటలు ఎండిపోతున్నా

కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్లు ఇవ్వట్లేదు



ఢిల్లీ (ఆగష్టు 5) : తెలంగాణలో గత 8 నెలలుగా పరిపాలన పడకేసిందని మాజీమంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి ఆరోపించారు. ప్రతిపక్షంపై రాజకీయ విమర్శలు, దాడులు తప్ప మరేమీ లేదని విమర్శించారు. మరీ ముఖ్యంగా సాగునీటి రంగంలో ఘోరంగా విఫలమైందని ఆరోపణలు చేశారు. సోమవారం నాడు ఢిల్లీ వేదికగా జగదీశ్వర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... గత యాసంగి (రబీ) పంటకు కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్లు అందించ లేకపోయిందని మండిపడ్డారు. గతంలో కేసీఆర్ పాలనలో యాసంగిలోనే భారీగా దిగుబడి

మిగతా 2లో...





## ఫస్ట్ మీటింగ్‌లోనే ఫుల్ క్లారిటీ

♦ విజన్ బయటపెట్టిన పవన్ కళ్యాణ్..

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తన విజన్‌ను కలెక్టర్ల సదస్సులో చెప్పేశారు. మంత్రివర్గం కూర్పునకు ముందు అందరూ పవన్ కళ్యాణ్‌కు హోంశాఖ కేటాయిస్తారంటూ పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. కానీ తాను ఏరికోరి గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ మంత్రిత్వశాఖలను తీసుకోవడం వెనుక ఉద్దేశం ఏమిటో కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో బయటపడింది. గ్రామాల అభివృద్ధి ఎంత అవసరం.. పట్టణాలు, నగరాలతో పాటు గ్రామాలను ఏవిధంగా తీర్చిదిద్దాలనే విషయంలో పవన్ కళ్యాణ్ ఫుల్ క్లారిటీతో ఉన్నట్లు ఈ కాన్ఫరెన్స్ ద్వారా తెలిసింది. అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించి.. రాష్ట్రాన్ని ఏ విధంగా అభివృద్ధి చేసుకో వచ్చో పవన్ కళ్యాణ్ పూసగుచ్చినట్లు వివరించారు.

2లో

## రుణమాఫీలో కాంగ్రెస్ దొంగ లెక్కలు

- 45 లక్షల మంది రైతులకు గాను 16లక్షలకే మాఫీ
- మాజీమంత్రి నిరంజన్ రెడ్డి విమర్శలు

హైదరాబాద్ తెలంగాణ ముచ్చట్లు : లక్షలోపు రుణం ఉన్న రైతులు గత ప్రభుత్వ హయాంలో 39 లక్షల మంది ఉంటే, ఆ సంఖ్య ఇప్పటికీ పెరిగి 45 లక్షలు అయింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి, రెండు విడతల్లో కలిపి కేవలం 16 లక్షల మంది రైతులకే రుణమాఫీ చేసింది మరి మిగతా రైతుల రుణమాఫీ సంగతి ఏంటి..? అని మాజీమంత్రి నిరంజన్ రెడ్డి కాంగ్రెస్ సర్కార్‌ను నిలదీశారు. తెలంగాన రాష్ట్రం కోసం జరిగిన మలిదశ ఉద్యమానికి కేంద్ర బిందువు తెలంగాణ వ్యవసాయం అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి గుర్తు చేశారు. వ్యవసాయానికి కావాల్సిన సాగునీరు, కరెంట్ ఇచ్చి



రైతాంగాన్ని నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ గట్టెక్కించా రని తెలిపారు. వ్యవసాయం మీద ఆధారపడి బతికే రైతులు గుండె

2లో



## జమ్మూకాశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహించండి

కేంద్రానికి ఖర్గే డిమాండ్

న్యూఢిల్లీ, తెలంగాణ ముచ్చట్లు : జమ్మూకశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే డిమాండ్ చేశారు. ఎన్నికల నిర్వహణలో నిర్లక్ష్యంపై కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. సుప్రీంకోర్టు నిర్దేశించిన గడువు ప్రకారం జమ్మూకశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. తద్వారా అక్కడి ప్రజలు

మిగతా 2లో...



## తెలంగాణలో ఉప ఎన్నికలు తప్పవు

- ▶▶ పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత అనివార్యం
- ▶▶ న్యాయకోవిదులతో బిఆర్ఎస్ బృందం భేటీ
- ▶▶ ప్రకటన విడుదల చేసిన వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్

మిగతా 2లో...

## మిమ్మల్ని ధీటుగా ఎదుర్కొంటాం

కేటీఆర్‌పై అద్దంకి ఫైర్

పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటుపడుతుందని.. తెలంగాణలో ఉప ఎన్నికలు వస్తాయంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్



కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ ఘాటుగా

2లో

# సంపాదకీయం

## సామాజిక న్యాయభావనకు 'సుప్రీం' దండోరా

సామాజిక న్యాయభావనను ప్రోది చేయడానికి అవిశ్రాంత సంవాదం నడిపిన చరిత్ర తెలుగునేలకు ఉంది. బ్రిటిష్, నిజాం వ్యతిరేక పోరాటంలో ప్రగతిదాయక ఆలోచనా స్రవంతి పరిపక్వం చెందింది. నక్సల్బరీ రాజకీయాలు వర్గపోరాటమే కాకుండా, ఉపశ్రేణుల ఆకాంక్షల చుట్టూ ఆవరించిన ప్రశ్నలకు పదును పెట్టాయి. ఎనభైయో దశకంలో వ్యక్తమయిన అస్తిత్వ ఉద్యమాలు విస్మరణకు గురైన సామాజిక సమూహాలలో రాజకీయ ఎరుకను తీసుకొచ్చాయి. 1984లో ఏర్పడిన బీఎస్పీ తెలుగు నేల మీదకు వేగంగా చొచ్చుకొచ్చింది. ఈ పార్టీ ప్రవేశానికి కారంచేడు మాదిగల హననం నేపథ్యంగా పని చేసింది. 1994 మార్చిలో నిజాం కాలేజీ మైదానంలో దక్షిణ భారతదేశ ఆదిజాంబవ అరుంధతీయ సమాఖ్య ఆధ్వర్యంలో మాదిగల సభ జరిగింది. ఈ సభకు ఐఏఎస్ అధికారి వెంకటస్వామి అధ్యక్షత వహించాడు. ఆ సంస్థకు ప్రధాన కార్యదర్శిగా డా.మందా జగన్నాథం వ్యవహరించారు. సదాలక్ష్మమ్మ, టీవీ నారాయణ లాంటి పెద్దలు సభ కోసం కృషి చేసారు. ఈ సభలో సాధారణ ప్రేక్షకుడిగా మందకృష్ణ పాల్గొన్నాడు. ఎస్సీ రిజర్వేషన్ పంపకంలో ఉన్న అసమానతలను తెలియ చేస్తూ ఆ సభలో పంచిన కరపత్రం చదివి ప్రేరణ పొందిన మందకృష్ణ ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ కోసం కార్యాచరణ రూపొందించుకోవాలని నిర్ణయించు కున్నాడు. అప్పటికే ఆయన పీపుల్స్ వార్ పార్టీ నుంచి బయటకు వచ్చి ఆంధ్రప్రాంతంలో దళితుల మీద జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా పని చేస్తున్నాడు. ముఖ్యంగా 1992 చీమకుర్తి గ్రానైట్ గనుల్లో ఏసమ్మ, రాములమ్మ అనే మాల యువతులను అగ్రకులం యువకులు అత్యాచారం చేసి చంపితే దానికి వ్యతిరేకంగా సమతా వాలంటీర్ ఫోర్స్ తరపున పని చేయడానికి మందకృష్ణ అక్కడికి వెళ్లాడు. ఈ నేపథ్యంలో ఈదుమూడి మాదిగ యువకులతో పరిచయం పెరిగి, వారి మధ్య జరిగిన అనేక చర్చల అనంతరం 7 జూల్కె 1994న ఎమ్మార్పీఎస్ అనే సంఘం ఏర్పడింది. 1995లో ఒంగోలు పట్టణంలో పదివేల మందితో వర్గీకరణ కోసం మొదటి బహిరంగసభ జరిగింది. ఈ సభకు సదాలక్ష్మమ్మ, ఐఏఎస్ అధికారి వెంకటస్వామి హాజరయ్యారు. తలవంచుకొని చెప్పులు కుట్టి, శరీరాన్ని కళగా మార్చి డప్పులు కొట్టిన మాదిగలు మొదటిసారి సామూహికంగా నిర్మాణమయ్యారు. 1996లో నిజాం కాలేజీ మైదానాన్ని మాదిగలు తమ అంటరాని మట్టి పాదాలతో పావనం చేసారు. లక్షమందికి పైగా సభకు హాజరై తమ ఆకాంక్షను వ్యక్తం చేసారు. అదే సంవత్సరం ఆగస్టులో బషీర్‌బాగ్‌లోని జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద వేలాది మంది మాదిగలు నిరసన దీక్షకు దిగారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఎస్సీ రిజర్వేషన్ పంపకంలో ఉన్న అసమానతలను అధ్యయనం చేయడానికి రామచంద్ర రాజు కమిషన్ నియమించింది. మూడు నెలల్లోనే ఆ కమిటీ తన నివేదికను ఇస్తూ మాదిగలకు జరిగిన అన్యాయాన్ని గణాంకాలతో సహా బయట పెట్టింది. ఈ నివేదికను అమలు చేసి మాదిగలకు న్యాయం చేయాలని కృష్ణ మాదిగ నారావారి పల్లె నుంచి పాదయాత్ర చేసి లక్షలాదిమందితో హైదరాబాద్ నగరాన్ని దిగ్బంధం చేసారు. ఫలితంగా ఎస్సీ రిజర్వేషన్‌ను ఏబీసీడీలుగా వర్గీకరణ చేస్తూ చంద్రబాబు ప్రభుత్వం జీవో ఇచ్చింది. ఆ జీవోలో ఉన్న సాంకేతిక విషయాల ఆధారంగా హైకోర్టు అభ్యంతరాన్ని చెప్పింది. గవర్నర్ ఆర్డినెన్స్ ద్వారా రాష్ట్రపతి ఆమోదంతో 1999 చివర్లో మరో జీవో వచ్చింది. ఈ జీవోను సవాల్ చేస్తూ కొందరు సుప్రీంకోర్టు మెట్లు ఎక్కారు. వి.చిన్నయ్య పేరు మీద కేసును ఫైల్ చేసారు. 2004 నవంబర్‌లో ఆర్టికల్ 341ను సాకుగా చూపుతూ ఆనాటి న్యాయమూర్తులు నాలుగేళ్లు అమలయిన చట్టాన్ని కొట్టి వేసారు. మాదిగలు తిరిగి రోడ్డు మీద దండోరా వేయక తప్పలేదు. మందకృష్ణ మాదిగ నాయకత్వంలో కోర్టు లోపల, బయట జరిగిన పోరాటాల ఫలితంగా, పంజాబ్ ప్రభుత్వం చూపిన శ్రద్ధ వల్ల సుప్రీంకోర్టు తన పనిని వేగవంతం చేసింది. 2020 ఆగస్టులో జస్టిస్ అరుణ్‌మిశ్రాతో కూడిన అయిదుగురు సభ్యుల ధర్మాసనం 2004 నాటి తీర్పును పూర్వపక్షం చేస్తూ రాజ్యాంగ ధర్మాసనానికి కేసును నివేదించాలని సూచించింది. ఈ నేపథ్యంలో ఏర్పడిన ఏడుగురు సభ్యుల ధర్మాసనం ఆర్టికల్ 341ను లోతుగా పరిశీలించి షెడ్యూల్డ్ జాబితాలో కొత్త కులాలను చేర్చడం, మినహాయించడం గురించి మాత్రమే ఈ ఆర్టికల్ చెబుతుంది, కనుక ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరించకూడదనే విషయాన్ని ప్రస్తావించలేదని ధర్మాసనం చెప్పింది. 2004లో వెలువరించిన తీర్పులోని న్యాయబద్ధతను ప్రశ్నించింది. రాజ్యాంగ ఫలాలను అందుకోవడంలో ఎస్సీ కులాల్లో ఆర్థిక, సామాజిక అసమానతలు ఇంకా కొనసాగుతున్నాయనే విలువైన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మాల సామా జిక వర్గానికి వ్యతిరేకమని, మాదిగ సామాజిక వర్గానికి అనుకూలమని భావించకుండా సామాజిక న్యాయభావనగా చూడవలసిన సందర్భమిది. మూడు దశాబ్దాలుగా ఈ రెండు సమూహాల మధ్యన ఎడం పెరిగి మానసికంగా దూరం పాటిస్తున్నారు.

## జమ్మూకాశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహించండి

తమ నాయకులను ఎన్నుకుంటారని తెలిపారు. జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు చేసి, ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఆర్టికల్ 370 రద్దుతో ఆ ప్రాంత ఆర్థికాభివృద్ధి మెరుగుపడుతుందని, తీవ్రవాదాన్ని అరికట్టే అవకాశం ఉంటుందని గతంలో మోదీ చెప్పారు. అయితే.. ప్రస్తుతం ఆయన మాటలకు భిన్నంగా జమ్ములో ఉగ్రదాడులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. 2019 నుంచి ఇప్పటి వరకు 683 ఉగ్రదాడులు చోటుచేసుకున్నాయి. 258 మంది జవాన్లు, 170 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారని ఖర్గే పేర్కొన్నారు. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ మూడో సారి ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి జమ్ములో 25 ఉగ్రదాడులు జరిగాయని.. 15 మంది సైనికులు ప్రాణాలు కోల్పోగా, 27 మంది గాయపడ్డారని తెలిపారు.

## ఫస్ట్ మీటింగ్‌లోనే ఫుల్ క్లారిటీ

ఆంధ్రప్రదేశ్‌లో గ్రామాలను ఏ విధంగా ఆదర్శంగా తీర్చిదిద్దాలి.. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను ఎలా బలోపేతం చేయాలనేదానిపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. అధికారులు ఏ విధంగా ముందుకెళ్లాలి.. తాను నిర్వర్తిస్తున్న శాఖలకు సంబంధించిన ప్రాధాన్యతలను తెలిపారు. గతంలో అధికారుల పనితీరు, ప్రభుత్వం ఎలా ఉండాలంటే ఆంధ్రప్రదేశ్ ఓ రోల్ మోడల్‌గా ఉండేదని.. కానీ గత ఐదేళ్లు ఎలా ఉండకూడదో అనే దానికి ఆంధ్రప్రదేశ్‌ను ఉదాహరణగా తీసుకునే పరిస్థితి వచ్చిందన్నారు. ఏపీలో పనిచేయాలంటే గతంలో సివిల్ సర్వెంట్ అధికారులు పోటీపడేవారని, గత ఐదేళ్లలో ఏపీలో పనిచేయాలంటూ కొందరు భయపడే పరిస్థితి వచ్చిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పనిచేసే అధికారుల పనితీరుపై తనకు విశ్వాసం ఉందని.. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని పవన్ అధికారులకు చెప్పారు.

గ్రామీణ వ్యవస్థ బలోపేతానికి..

గ్రామపంచాయతీ వ్యవస్థను బలోపేతం చేసే విషయంలో అధికారులకు కీలక సూచనలు చేశారు. గతంలో ఏ ఒక్కరూ చేయని విధంగా గ్రామాలను అభివృద్ధి చేయాలని, ప్రజల భాగస్వామ్యంతో ముందుకెళ్లాలని తెలిపారు. కలెక్టర్ల సదస్సులో పవన్ కళ్యాణ్ తన మంత్రిత్వ శాఖ పరిధిలో ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలనే దానిపైనే ఫోకస్ చేశారు. ప్రజలందరికీ సురక్షిత తాగునీరు అందిచడం, గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దడం, ప్రతి ఒక్కరికీ ఉపాధి అవకాశాలు లభించేలా చర్యలు తీసుకోవడంపై పవన్ కళ్యాణ్ అధికారులకు కీలక ఆదేశాలు జారీచేశారు. తమవైపు నుంచి ఎవైనా తప్పులుంటే వెంటనే సరిదిద్దే ప్రయత్నం చేయాలని చెప్పారు. అదే సమయంలో అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని, ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మాత్రం చర్యలు తప్పవని చెప్పారు. తనకు పరిపాలనా అనుభవం లేకపోయినప్పటవికీ సుదీర్ఘ పాలనా అనుభవం ఉన్న చంద్రబాబును చూసి ఎన్నో విషయాలు నేర్చుకుంటున్నానని చెప్పడం ద్వారా పరోక్షంగా అధికారులకు పవన్ కళ్యాణ్ కీలక సూచనలు చేసినట్లైంది. అధికారులు తాము ఐఏఎస్, ఐపీఎస్‌లం కాబట్టి.. అన్ని విషయాలు తమకు తెలుసని భావించ వద్దని, ఎప్పటికప్పుడు సీనియర్లు, అనుభవజ్ఞుల నుంచి కొత్త విషయాలు నేర్చుకోవాలనే సందేశాన్నిచ్చారు. కలెక్టర్ల సదస్సులో పవన్ ప్రసంగం విన్న తర్వాత రాష్ట్ర అభివృద్ధి కోసం తాను పరుగులు పెడతాననని, తనతో పాటు అధికారులు పరుగులు పెట్టాలని పరోక్షంగా చెప్పినట్లు అర్థం చేసుకోవచ్చు.

## తెలంగాణలో ఉప ఎన్నికలు తప్పవు

న్యూఢిల్లీ,తెలంగాణ ముచ్చట్లు : పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత విషయంలో న్యాయపరమైన చర్యలు తీసుకునేందుకు బీఆర్ఎస్ ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఈ మేరకు ఢిల్లీలోని పలువురు ప్రముఖ న్యాయ కోవిదులతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో సీనియర్ నాయకుల బృందం చర్చలు జరిపింది. అటు రాజ్యాంగ నిపుణులతోనూ ఇవ్వాళ పార్టీ ప్రతినిధి బృందం సమావేశమైంది. బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు తప్పదని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై ఢిల్లీలో బీఆర్ఎస్ న్యాయపోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. రాజ్యాంగ నిపుణులతో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ ప్రతినిధుల బృందం సమావేశం అయింది. త్వరలోనే సుప్రీంకోర్టులో పార్టీ తరఫున కేసు వేయనున్నట్లు కేటీఆర్ తెలిపారు. కోర్టు తీర్పు ద్వారా నెల రోజుల్లోనే ఫిరాయింపు నేతల అనర్హత అంశంలో స్పష్టత వస్తుందని రాజ్యాంగ నిపుణులు చెబుతున్నారని, తెలంగాణలో ఉప ఎన్నికలు తప్పవని పార్టీ మారిన ఎమ్మెల్యేలకు ప్రజాక్షేత్రంలో బుద్ధి చెబుతామని కేటీఆర్ హెచ్చరించారు. మరోవైపు ఇప్పటికే పార్టీ ఫిరాయింపుల విషయంలో మణిపూర్‌కు సంబంధించి ఎమ్మెల్యే సహా సుప్రీంకోర్టు పలు తీర్పులు ఇచ్చిందని రాజ్యాంగ నిపుణులు పార్టీ బృందానికి తెలిపారు. గతంలో మాదిరిగా అనర్హత వేటు విషయంలో సుదీర్ఘకాలం పాటు నిర్ణయం తీసుకోకుండా స్పీకర్ ఈ అంశాన్ని నాన్చలేరని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముగ్గురు ఎమ్మెల్యేల అనర్హత వేటుకు సంబంధించి హైకోర్టులో వేసిన పిటిషన్‌తో పాటు, పార్టీ మారిన ఎమ్మెల్యేలపైన స్పీకర్‌కు చేసిన ఫిర్యాదు విషయాన్ని, వాటికి సంబంధించిన పత్రాలను న్యాయ నిపుణులకు బీఆర్ఎస్ నేతలు అందించారు. ఈ విషయంలో ప్రస్తుతం సుప్రీంకోర్టు మార్గదర్శకాలు స్పష్టంగా ఉన్నందున హైకోర్టు సైతం ఎక్కువ కాలం వాయిదా వేసే అవకాశం లేదని న్యాయ నిపుణులు తెలిపారు. హైకోర్టు నిర్ణయం త్వరగా ప్రకటిం చకుంటే సుప్రీంకోర్టుకు వెళ్లే అవకాశం ఉందన్నారు. సుప్రీంకోర్టు తీర్పులతోపాటు న్యాయ కోవిదులు, రాజ్యాంగాన్ని నిపుణులు చెబుతున్న సలహాలు, సూచనల మేరకు న్యాయపోరాటం కొనసాగిస్తామని కేటీఆర్ తెలిపారు. త్వరలోనే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామన్నారు. హైకోర్టు లేదా సుప్రీంకోర్టు ద్వారా నెల రోజుల్లో పార్టీ మారిన ఎమ్మెల్యేల పైన అర్హత వేటు అంశం తేలిపోతుందని కేటీఆర్ విశ్వాసం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఉప ఎన్నికలు తప్పవని... పార్టీ మారిన ఎమ్మెల్యేలకు ప్రజాక్షేత్రంలోనే బుద్ధి చెప్తామన్నారు. ఒకవైపు జాతీయ స్థాయిలో పార్టీ ఫిరాయింపుల పైన సుద్దపూస ముచ్చట్లు చెబుతూ తెలంగాణ రాష్ట్రంలో రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసేలా కాంగ్రెస్ పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తుందని కేటీఆర్ మండిపడ్డారు. త్వరలోనే కోర్టుల సహాయంతో కాంగ్రెస్‌కు సరైన గుణపాఠం చెబుతామన్నారు. రాజ్యాంగ నిపుణులు, న్యాయ కోవిదులతో జరిగిన సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు మాజీ మంత్రి హరీష్ రావు, జగదీష్ రెడ్డి, గంగుల కమలాకర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సహా పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## రుణమాఫీలో కాంగ్రెస్ దొంగ లెక్కలు

మీద చేయి వేసుకుని నిద్రపోయే పరిస్థితిని నాటి సీఎం కేసీఆర్ తీసుకొచ్చారు. సహజ వనరులైన భూములను, వాటికి అవసరమైన జలాలు, కరెంట్, పెట్టుబడి వంటి సంపూర్ణ రక్షణ వలయాన్ని ఏర్పాటు చేశారు కేసీఆర్. దేశంలోని ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు కూడా తెలంగాణ వ్యవసాయాన్ని కీర్తించాయి. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ కూడా తెలంగాణ వ్యవసాయం గొప్పగా ఉందని ప్రశంసించారు. నేను కలల కన్నట్లు తెలంగాణ వ్యవసాయం ఉందని స్వామినాథన్ అన్నారని నిరంజన్ రెడ్డి గుర్తు చేశారు. ముందేమో రైతు రుణాలు రూ. 40 వేల కోట్లు అని చెప్పి, చివరకు పత్రికా ప్రకటనల్లో రూ. 31 వేల కోట్లు.. చేశారని అన్నారు. భారతదేశం లోనే తొలిసారి సాహసం చేసి.. వ్యవసాయాన్ని గట్టెక్కి స్తే వారే పది మందికి ఉపాధి కల్పిస్తారనే మదనపడి తన మేధస్సును కరిగించి తెలంగాణ వ్యవసాయాన్ని బాగు చేశారు కేసీఆర్. అందులో భాగంగానే కేసీఆర్ రైతుల రుణాలను మాఫీ చేశారు. రైతుబంధు, రైతు బీమా వంటి పథకాలు ప్రవేశపెట్టారు. 39 లక్షల మంది రైతులకు రుణాలు మాఫీ చేశాం. మిగిలిన వారికి ఎన్నికల తర్వాత చేస్తామన్నాం కానీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. తెలంగాణ రైతాంగానికి ఎన్నికలు, ఓట్ల కోసం హోల్ సేల్ అబద్ధాలు చెప్పింది కాంగ్రెస్ పార్టీ. వారి మేనిఫెస్టోలో కూడా 2 లక్షల రుణమాఫీ డిసెంబర్ 9నాడు చేసి తీరుతామని చెప్పా రు. అవసరమైతే రైతులు రుణాలు అర్జంట్‌గా తెచ్చుకోం డని నేటి సీఎం రేవంత్ రెడ్డి నాడు చెప్పారు. ముందేమో రైతు రుణాలు రూ. 40 వేల కోట్లు అని చెప్పి, చివరకు పత్రికా ప్రకటనల్లో రూ. 31 వేల కోట్లు అని ప్రకటిం చారు. కాంగ్రెస్ పార్టీ డిసెంబర్ 9న రుణాలు మాఫీ చేస్తామని చెప్పి.. జులై నెలలో కేవలం 6 వేల కోట్లు మాత్రమే మాఫీ చేశారు. రైతుబీమా వచ్చిన తర్వాత సమిష్టిగా ఉండే కుటుంబాల్లో భూములు పంచుకుని వ్యవసాయం చేశారు. తెలంగాణ సర్కార్ దిగిపోయే నా టికి రైతుబంధు ఖాతాలు 69 లక్షల పైచిలుకు ఉంటే రుణాల తీసుకున్న సంఖ్య 60 లక్షల పైచిలుకు ఉంది. మరి ఈ 60 లక్షల పైచిలుకు రుణాలు పొంది ఉన్న రైతుల్లో 5 ఎకరాల్లోపు భూమి ఉన్న రైతుల సంఖ్య ఎక్కువ. తొంభై రెండున్న శాతం భూమి 5 ఎకరాల్లోపు ఉన్న రైతుల చేతుల్లో ఉంది. అటువంటప్పుడు లక్ష లోపు రుణం కలిగిన ఉన్న రైతుల సంఖ్య 39 లక్షలు ఉంటే.. ఇప్పుడు అది 40 నుంచి 45 లక్షల మధ్యలో ఉండాలి. మరి కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి విడుతలో 11 లక్షలు, రెండో విడుతలో 5 లక్షల మంది రైతులకు మాత్రమే రుణాలు మాఫీ చేసింది. మరి మిగతా రైతులు ఎటు పోయారు..? రుణమాఫీకి అర్హులైన రైతుల సంఖ్యను జిల్లాలవారీగా ఎందుకు ఇవ్వడం లేదు.

## వయనాడ్ విషాదానికి కారణమదే..

సంచల న ఆరోపణ చేశారు. వయనాడ్‌లో అక్రమ గనుల తవ్వకాలు, జనవాసాల వల్లే అపార ప్రాణనష్టం జరిగిందని తెలిపారు. అక్రమ జనావాసాలకు స్థానిక రాజకీయవేత్తల రక్షణ ఉందని, కనీసం టూరిజం పేరుతో సరైన జోన్లను కూడా వాళ్లు ఏర్పాటు చేయలేదని, ఈ ప్రాంతంలో భూకబ్జాలు జరిగాయని కేంద్ర మంత్రి ఆరోపించారు. ప్రమాదం జరిగిన ప్రాంతం 'హైలీ సెన్సిటివ్ ఏరియా' అని తెలిపారు. అటవీ శాఖ మాజీ డైరెక్టర్ జనరల్ సంజయ్ కుమార్ సారథ్యంలో తాము ఇప్పటికే ఒక కమిటీ వేశామని, స్థానిక ప్రభుత్వ యంత్రాగం పరిరక్షణలో అక్కడి అక్రమ జనావాసాలున్నాయని, అక్రమ గనుల తవ్వకాలు జరుగుతున్నాయని భూపేందర్ యాదవ్ తెలిపారు.

## పంటలు ఎండిపోతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్లు ఇవ్వట్లేదు

వచ్చిందని తెలిపారు. గోదావరి, కృష్ణా నదుల నుంచి లక్షలాది టీఎంసీల నీరు వృథాగా సముద్రం పాలవుతోందని చెప్పారు. ఆ నీటిని కాలువల ద్వారా చెరువులు నింపే అవకాశం ఉందని కానీ ఈ ప్రభుత్వం ఆ పని ఎందుకు చేయడం లేదని జగదీశ్వర్ రెడ్డి ప్రశ్నించారు.

కరవు పరిస్థితులు

శ్రీశైలం, నాగార్జున సాగర్‌కు నీళ్లు వస్తాయన్న సమాచారం తమకు ఉందని అన్నారు. ఆ నీటిని సద్వినియోగం చేసుకోవాలన్న సోయి ప్రభుత్వానికి లేదన్నారు. మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల్లో వర్షాభావం కారణంగా కరవు పరిస్థితులు కనిపిస్తున్నాయని చెప్పారు. నాగార్జున సాగర్ ఎడమ కాల్వకు నీటిని విడుదల చేసి అన్ని రిజర్వాయర్లు, చెరువులు నింపాలని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా పాలేరు కూడా ఖాళీగా ఉందని.. ఆ రిజర్వాయర్ సహా దాని కింద ఉన్న చెరువులు నింపాల్సిన అవసరం ఉందని తెలిపారు. కృష్ణా నది నీటిని కిందికి వదిలి సముద్రం పాలు చేస్తున్నారని జగదీశ్వర్ రెడ్డి ధ్వజమెత్తారు.

## సైన్యం చేతుల్లోకి బంగ్లాదేశ్

ఇచ్చినట్లు పలు వార్తా కథనాలు పేర్కొన్నాయి. ఈ క్రమంలోనే రాజీనామా చేసి, సురక్షిత ప్రాంతానికి వెళ్లిపోయినట్లు సమాచారం. ఇదిలా ఉంటే.. త్రిపుర రాజధాని అగర్తలకు హసీనా చేరుకున్నారని తెలుస్తుంది. అక్కడి నుంచి లండన్‌కు వెళ్లనున్నారని సమాచారం. ఈ పరిణామాల వేళ.. బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా కుమారుడు సాజీద్ వాజెద్ జాయ్ ఫేస్‌బుక్‌లో పోస్టు పెట్టారు. అధికారాన్ని చేజిక్కించుకోవాలని యత్నించే ప్రతిఒక్కరిని అడ్డుకోవాలని సైన్యాన్ని కోరారు. ప్రజలను, ఈ దేశాన్ని సురక్షితంగా ఉంచడం మీ బాధ్యత. ఎన్నిక కాని ప్రభుత్వం అధికారంలో కూర్చోవడానికి ఒక్క నిమిషం కూడా అనుమతించొద్దు. ప్రధానిని గద్దె దించితే మనం సాధించిన అభివృద్ధి అంతా మట్టిలో పోసినట్టవుతుంది. తిరిగిమళ్లీ పుంజుకోలేదు. మనం అలాంటి పరిస్థితిని కోరుకోం అని ఫేస్‌బుక్‌లో పోస్టు పెట్టారు. ఆయన ప్రధానికి ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ అడ్వైజర్‌గా పనిచేస్తున్నారు.

## కేజ్రీవాల్‌కి దక్కని ఊరట

సీబీఐ తరఫున ఎస్వీపీ సింగ్ హాజరయ్యారు. ఈ పాలసీపై కేజ్రీవాల్‌తో పాటు అప్పటి లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజాల్ కూడా సంతకం చేశారని సింఘ్వీ వాదించారు. మాజీ ఎల్జీ, బ్యూరోక్రాట్‌లను కూడా నిందితులుగా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మరోవైపు మొత్తం కుంభకోణంలో కేజ్రీవాల్ ప్రమేయం ఉందని, అందుకు తమ వద్ద సాక్ష్యాలు ఉన్నాయని సింగ్ తెలిపారు. అరెస్టు చట్టవిరుద్ధం కాదని ట్రయల్ కోర్టు ఇప్పటికే నిర్ధారణకు వచ్చిందని ఆయన అన్నారు. కేజ్రీవాల్‌పై సీబీఐ ఛార్జిషీట్ దాఖలు చేసిందని.. ముఖ్యమంత్రికి బెయిల్‌పై విడుదలయ్యే అర్హత లేదని సింగ్ పేర్కొన్నారు. సహ నిందితులు మనీష్ సిసోదియా, కె కవితపై ఛార్జిషీట్ దాఖలు చేసినప్పటికీ కోర్టు బెయిల్ నిరాకరించిన విషయాన్ని గుర్తు చేశారు. 'ఇన్సూరెన్స్ అరెస్ట్' అనే పదాన్ని ఉపయోగించడం సరికాదని ఆయన పేర్కొన్నారు. కేజ్రీవాల్‌కు సీబీఐ ముందస్తు నోటీసు ఇవ్వాల్సిన అవసరం లేదని ఆయన వ్యాఖ్యానించారు. కేజ్రీవాల్ ట్రయల్ కోర్టును ఆశ్రయించకుండానే నేరుగా బెయిల్ కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. లిక్కర్ స్కాం కేసుల్లోనే ఆయన జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. ప్రస్తుతం తిహార్ జైలులో శిక్ష అనుభవిస్తున్నారు. మార్చి 21న కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్టు చేసింది. మేలో, సాధారణ ఎన్నికల దృష్ట్యా జూన్ 01 వరకు సుప్రీంకోర్టు ఆయనకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. జూన్ 2న ఆయన తిరిగి లొంగిపోయారు.

## మిమల్ని ధీటుగా ఎదుర్కొంటాం..

స్పందించారు. బీఆర్ఎస్ చేతకానితనం వలనే ఆ పార్టీ ఎమ్మెల్యేలు పక్క పార్టీల వైపు చూస్తున్నారన్నారు. కేసీఆర్, కేటీఆర్ తమ పార్టీ ఎమ్మెల్యేలను కాపాడుకోలేకపోతున్నారని, తప్పని పరిస్థితుల్లో వాళ్లను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకుంటున్నామన్నారు. కాంగ్రెస్‌లోకి వస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అడ్డుకోవడానికి కేటీఆర్ చేస్తున్న ప్రయత్నాలు చూస్తుంటే నవ్వొస్తుందన్నారు. రాజకీయాల్లో బీఆర్ఎస్ నీతిగా వ్యవహరించడం లేదన్నారు. బీఆర్ఎస్ సరైన పద్ధతులను పాటించడం లేదని అద్దంకి దయాకర్ విమర్శించారు. రాష్ట్రంలో ఈ రకమైన పరిస్థితులు రావడానికి ప్రధాన కారణం కేసీఆర్ అన్నారు. పార్టీ ఫిరాయింపులు తెలంగాణలో మాత్రమే లేవని.. దేశంలో ఇదో ప్రక్రియగా మారిపోయిందన్నారు. టీడీఎల్పీని, సీఎల్పీని బీఆర్ఎస్‌లో విలీనం చేసుకున్నప్పుడు కేసీఆర్, కేటీఆర్‌కు సిగ్గు అనిపించలేదా అని అద్దంకి ప్రశ్నించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కేటీఆర్‌కుచట్టం,న్యాయం ఎందుకు కనిపించలేదన్నారు. రాజకీయాల్లో అందరికీ ఒకటే న్యాయం ఉంటుందని, మీకో న్యాయం, ఇతరులకు మరో న్యాయం ఉండదని అద్దంకి దయాకర్ తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU


# ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

## -రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు





**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు :** ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం మంత్రి వైరాలో ముఖ్యమంత్రి సభకు నిర్దేశించిన స్థలాన్ని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా వైరాలో సభ చేపట్టనున్నట్లు తెలిపారు. భద్రత, పార్కింగ్ పరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. హెలీప్యాడ్, బ్యారీకెటింగ్, డయాస్ కు సంబంధించి చర్యలు తీసుకోవాలని మంత్రి అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, వైరా తహశీల్దార్ కార్యాలయములో అధికారులతో సమావేశమై ముఖ్యమంత్రి పర్యటన విషయమై సూచనలు చేశారు. సభాస్థలి లెవలింగ్, చెత్త తొలగింపు పనులు రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. సభాస్థలి కి వెళ్లుటకు గుర్తించిన రోడ్ల లెవలింగ్, ఏర్పాటు పనులు చేపట్టి వెంటనే పూర్తి చేయాలన్నారు. 3 పార్కింగ్ స్థలాలు, మీటింగ్ పాయింట్ లొకేషన్ స్కెచ్ వేయాలని, వీటితో పాటు మొత్తం ప్రదేశం కు సంబంధించి మొత్తం 5 మ్యాపులు సిద్ధం చేయాలని అన్నారు. సభాస్థలి లో రైతులతో మాట్లాడి, హద్దులు సభ అనంతరం తిరిగి పెడతామని హామీ ఇవ్వాలని ఆయన అన్నారు. ఈ నెల 8 లోపు ల్యాండ్ లెవలింగ్, వాటర్ లాగింగ్ ప్రాంతం క్లియరెన్స్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. హెలీప్యాడ్, సభాస్థలి ఏర్పాట్లు ఈ నెల 12 లోగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ ట్రాన్స్ఫార్మర్, లైన్ల షిఫ్టింగ్ రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. అనంతరం వైరా తహసీల్దార్ కార్యాలయంలో చేపడుతున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ప్రజల ప్రతి అర్జీని నమోదు చేయాలని, సాయంత్రం 4.00 గంటలకల్లా దరఖాస్తుల అప్డేషన్ పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని, త్వరితగతిన పరిష్కారం చేయాలని, అర్జీ తిరస్కరించిన చోట కారణాలు దరఖాస్తుదారునికి తెలుపాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, ఆర్ అండ్ బి ఎస్ఇ హేమలత, నేషనల్ హైవే ఇఇ యుగంధర్ రావు, వైరా మండల తహశీల్దార్ శ్రీనివాసరావు, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సమీకృత వ్యవసాయం ద్వారా రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చు

## -జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్





**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు :** సోమవారం టేకులపల్లి మండలం సులానగర్ గ్రామం లోని ధరావత్ హార్జా అనే రైతు వేసిన మునగ సాగును జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్ ఆర్ జి ఎస్ ద్వారా మునగ పంటను వేస్తున్న వారికి అన్ని విధాలుగా ప్రోత్సాహకాలు, సబ్సిడీలు అందుతాయని అదేవిధంగా పంట చేనులో ఫారం పాండ్లు ఎనర్జీఎన్ ద్వారా తీయించడం జరుగుతుందని ఈ ఫారం పాండ్లలో రైతు చేపల పెంపకం చేసుకుంటే లాభదాయకంగా ఉంటుందని తెలిపారు. ఎకరం సాగు భూమిలో ప్రధాన పండగ పత్తిని సాగు చేస్తూ అంతర పంటగా 1000 మునగ మొక్కలను నాటి సాగు చేస్తున్న రైతును కలెక్టర్ అభినందించారు. రైతులు ఒక పంట మీదనే ఆధారపడకుండా ఇదేవిధంగా అంతర్ పంటల ద్వారా అధిక లాభాలను ఆర్జిస్తూ ఆర్థికంగా అభివృద్ధి చందవచ్చని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ పొలంలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఓ విద్యా చందన తదితరులు పాల్గొన్నారు.

# కేరళ బాధితులకు సహాయాన్ని అందించి అండగా నిలవండి..

## - ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి

**రాజేంద్రనగర్, తెలంగాణ ముచ్చట్లు :** ఆగస్టు 05 : కేరళలోని వయనాడ్ వరద బాధితులకు సహాయం చేసేందుకు ఆదివారం ఎఐటియుసి రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం విరాళాలు సేకరించారు. కేరళలో కొండచరియలు విరిగిపడటంతో జరిగిన విధ్వంసం గురించి వివరిస్తూ..కాటేదాన్ పరిశ్రామిక వాడలో దుకాణాల వద్దకు వెళ్లి విరాళాల సేకరణ చేపట్టారు.పలువురు దాతలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి విరాళాలు అందించారు.ఈ సందర్భంగా వనంపల్లి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ...వయనాడ్ బాధితులను ఆదుకునేందుకు ప్రతిఒక్కరూ మానవతాదృక్పథంలో ముందుకు రావాలని కోరారు.వరద బాధితుల సహాయార్థం మానవత్వం కలిగిన ప్రతిఒక్కరు తోచిన విధంగా ధన,వస్తురూపేన సహాయం అందించాలని సూచించారు.

# స్కిల్ వర్సిటీ ఛైర్మన్‌గా ఆనంద్ మహీంద్రా

**హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకం గా ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఛైర్మన్‌గా ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా వ్యవహరిస్తారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పెట్టుబడుల వేటలో భాగంగా ప్రస్తుతంఅమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి.. న్యూజెర్సీలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో మాట్లాడారు. స్కిల్ వర్సిటీ ఛైర్మన్‌గా ఆయన రెండు మూడు రోజుల్లో బాధ్యతలు చేపట్టే అవకాశం ఉందని తెలిపారు. రాష్ట్ర యువతకు నైపుణ్యాలు నేర్పించేలా రంగారెడ్డి జిల్లాలో ముచ్చర్లలోని బేగరికంచెలో స్కిల్ యూనివర్సిటీ నిర్మాణానికి సీఎం గత వారం శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. 17 రకాల కోర్సుల్లో శిక్షణ ఇచ్చి ప్రైవేటు సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. ఏటా లక్షమందికి శిక్షణ ఇచ్చేలా రాబోయే కాలంలో ఈ వర్సిటీని విస్తరించనున్నారు. బేగరికంచెలో సొంత భవనం పూర్తయ్యే వరకు గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా భవనంలో వర్సిటీ కార్యకలాపాలు కొనసాగనున్నాయి. ఇకపోతే హైదరాబాద్‌ను ప్రపంచంలోనే అగ్రగామి నగరంగా నిలుపుతామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. న్యూజెర్సీలో ఆదివారం జరిగిన ప్రవాసుల ఆత్మీయ సమ్మేళానికి హాజరైన సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ మీ జన్మభూమి, మీ దేశంలో మీరు పెట్టిన ప్రతి పెట్టుబడికి తప్పకుండా ప్రయోజనం ఉంటుంది. అంతకు మించిన అత్యుత్తమ ప్రతిఫలం ఉం టుందని అన్నారు. మన ప్రాంత అభివృద్ధిలో భాగస్వామ్యం పంచుకుంటే అంతకు మించిన సంతృప్తి బోనస్‌గా లభిస్తుంది..'అని అన్నారు. ఎన్నికల ముందు మాపై ఎంతో విష ప్రచారం జరిగిందని, గిట్టని వాళ్లందరూ అసలు కాంగ్రెస్ అధికారంలోకి రాదని అన్నారనని, వచ్చినా నిలబడదని అన్నారని సీఎం చెప్పారు. ఇప్పుడు రాష్ట్రంలో అభివృద్ధి మందగిస్తుందంటూ లేనిపోని అపోహలు సృష్టించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని అన్నారు. వాళ్లకు ఇప్పటికే బుద్ధి చెప్పామని, అబద్దాల కోరుల మాటలు తప్పని నిరూపిద్దామని, హైదరాబాద్‌ను భారతదేశంలోనే కాదు.. ప్రపంచంలోనే అగ్రగామి నగరంగా నిలుపుదామని సీఎం పిలుపునిచ్చారు. ప్రవాసులు తమ నైపుణ్యాలు, మీ ప్రతిభా పాటవాలతో అమెరికాను పటిష్టంగా, సంపన్నంగా మార్చారని, ఇకపై తెలంగాణకు సేవలు అందించాలని కోరారు. తెలంగాణలో మెట్రో కోర్ అర్బన్‌తో పాటు, సెమీ అర్బన్, రూరల్ క్లస్టర్లుగా విభజించి పెట్టుబడులకు ప్రత్యేకమైన వ్యవస్థలను రూపొందిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ఈస్ట్ కోస్ట్ ఇండియన్ కమ్యూనిటీకి చెందిన పలువురు ముఖ్యులతో సీఎం మాట్లాడుతూ, హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ తరహాలో నాలుగో నగరంగా ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ప్రపంచ స్థాయి మాస్టర్ ప్లాన్‌తో హైదరాబాద్‌ను తీర్చిదిద్దనున్నామని అన్నారు. ఓవర్సీస్ కాంగ్రెస్ పార్టీ అమెరికా అధ్యక్షుడు మొహిందర్ సింగ్ గిల్జియాన్ మాట్లాడుతూ.. 'మిమ్మల్ని ముఖ్యమంత్రిగా చూడాలన్న మా కోరిక నెరవేరింది. ఇప్పుడు రాహుల్ గాంధీని భారత ప్రధానిని చేయడానికి మనమందరం కష్టపడాలి' అన్నారు. సాఫ్ట్‌వేర్, ఫార్మా, వ్యాక్సిన్‌లు, హెల్త్‌కేర్, అర్టిఫిషియల్ రంగాల్లో తెలంగాణ బలమైన స్థావరంగా ఎదగాలని ఆకాంక్షించారు.



# మక్తల్ చెరువును పూర్తి స్థాయిలో నింపేందుకు చర్యలు

**మక్తల్, తెలంగాణ ముచ్చట్లు:** పెద్ద చెరువును పూర్తి స్థాయిలో నింపేందుకు చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆదేశించారు. నారాయణపేట రోడ్ లోని భీమా కాలువ వద్ద మక్తల్ పెద్ద చెరువుకు వరద నీళ్ళు వెళ్లే పాటు కాలువను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా పెద్ద చెరువును పూర్తి స్థాయిలో నింపేందుకు చర్యలు తీసుకోవాలని, అవసరమైతే మోటార్ల సాయంతో నీటిని చెరువులోకి ఎత్తిపోయాలని సూచించారు. ప్రస్తుతం క్రిష్ణా నదికి పెద్ద ఎత్తున వరద వస్తోందని, ఈ సమయంలో సాధ్యమైనంత ఎక్కువగా నీటిని ఎత్తిపోసుకుని నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న చెరువులను నింపుకుని, సాగు నీరు పుష్కలంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మక్తల్ పెద్ద చెరువులో ఎల్లప్పుడూ నీళ్ళు ఉండేలా చర్యలు చేపట్టి, రాబోయే రోజుల్లో పర్యాటక పరంగానూ మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.అంతకుముందు నివాసంలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు కట్టా సురేష్ గుప్తా, రాయికోడ్ ఆనంద్, చెన్నయ్య సాగర్, నాగరాజ్, చందాపూర్ వెంకట్రాములు, రంజిత్ రెడ్డి, గుంతలి రవి, ఏఈ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హత కల్గిన అధ్యాపకుల నిర్లక్ష్యం వల్ల వనపర్తి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల లో యన్. సి. సి నిర్వీర్యం

## - కాంటెస్టడ్ స్వతంత్ర ఎమ్మెల్యే దయానంద్ ముదిరాజ్



**వనపర్తి జిల్లా ప్రతినిధి తెలంగాణ ముచ్చట్లు:** అర్హత కలిగిన అధ్యాపకుల నిర్లక్ష్యం వల్ల వనపర్తి బాలుర జూనియర్ కళాశాలలో యన్. .సి. సి ని నిర్వీర్యం చేశారని వనపర్తి కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి దయానంద ముదిరాజ్ అన్నారు. సోమవారం వనపర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలను దయానందరాజ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యన్. సి. సి నిర్వీర్యం వల్ల విద్యార్థులు నష్ట పోతున్నారని వనపర్తి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో యన్. సి.సి. ఇంచార్జ్ లేకపోవడ%శీ% తో వనపర్తి హెడ్ క్వాటర్ లో ప్రభుత్వ జూనియర్ బాలుర కళాశాల లో రెండు సంవత్సరాలనుండి యన్. సి. సి లేక విద్యార్థులు (బి సర్టిఫికెట్ ) నష్టపోయారు. ఉన్నత విద్యా మరియు ఉద్యోగాలో అవకాశాలలో బి సర్టిఫికెట్ కి చాలా ప్రాధాన్యత. విద్యార్థులు నష్టపోతున్న అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. అర్హత కల్గిన అధ్యాపకుల నిర్లక్ష్యం వల్ల యన్. సి. సి వనపర్తి లో కుంటుపడుతుందని ప్రిన్సిపాల్ వినోద్ తెలియజేశారు. విద్యార్థులు నష్టపోతున్న చలనం లేని అధ్యాపకులపై అధికారుల పై ఆర్. జె. డి తక్షణమే చర్యలు చేపట్టాలి. తక్షణమే యన్. సి. సి సెలక్షన్స్ జరగాలని ప్రిన్సిపాల్ కి అధికారిక వినతిపత్రం అందజేశారు .గత%శీ%లో విద్యార్థులు జిల్లా కలెక్టర్ సమస్య ను చెప్పిన ధర్నాలు చేసిన ఫలితం లేదని మీము ఎన్నో ఆశలతో యన్. సి. సి ఉందని ప్రభుత్వ కళాశాల లో చేరాము మమ్మల్ని నష్టపరిచిన వారిపై శాఖ పరమైన చర్యలు చేపట్టాలని విద్యార్థులు బాధను తెలిపారు..

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL12273
మంగళవారం 6 -08- 2024



# అర్జీదారుల దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు సత్వర చర్యలు చేపట్టాలి

## -అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్





ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు : అర్జీదారుల దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు సత్వర చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన "గ్రీవెన్స్ డే"లో అర్జీదారుల నుండి ఆయన వినతులు స్వీకరించి తగుచర్య నిమిత్తం ఆయా శాఖల అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఖమ్మం నగరానికి చెందిన బి. రమణ, భర్త లేటు క్రిష్ణ, వెటర్నరీ ఆఫీసు ఖమ్మంనందు ఆఫీసు సబార్డినేటుగా విధులు నిర్వహించి, 2021 సంవత్సరంలో రిటైర్‌మెంట్ కావడం జరిగినదని, తనకు రావాలసిన పి.ఆర్.సి. బకాయిలు మంజూరు చేయాలని తనకు న్యాయం చేయగలరని సమర్పించిన దరఖాస్తును తగు చర్య నిమిత్తం జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారికి సూచించారు. కొనిజర్ల మండలం సింగరాయపాలెం గ్రామంకు చెందిన వుప్పెల వెంకటరెడ్డి తనకు సింగరాయపాలెం రెవెన్యూ సర్వే నెం.180/అ:/1లో 0.22 ఎకరాలు, 240/బిలో 2.04, 245/అ/1/లో 0.07, 288/ఆలో 4.33, 243లో 2.21, 289/ఆ/2లో 0.39 మొత్తం 11.06 ఎకరాల వ్యవసాయ భూమి వారసత్వంగా సంక్రమించి తన హక్కు భుక్తములో పట్టాదారు పాసు పుస్తకం ఖాతా నెం. 40 కలిగి ఉన్నానని అట్టి భూమిని జూలై 2021లో తన భార్య వుప్పెల స్వరూప పేరున దస్తావేజుపై స్వాధీన అగ్రిమెంటు ఇవ్వడం జరిగినదని అందుకు తన భూమిని కాజేయాలనే నెపంతో మదిగొండ మండలంకు చెందిన తన బంధువులు అయినటువంటి గాంధీ సంజీవరెడ్డి గ్రామం పంద్రేగుపల్లి, గాంధీ కృష్ణవేణి భర్త సంజీవరెడ్డి, గాంధీ స్పందన తండ్రి సంజీవరెడ్డి, గాంధీ సుచిత్ర, తండ్రి సంజీవరెడ్డి, గ్రామం పంద్రేగుపల్లి, ఎరబోలు కృష్ణారెడ్డి, తండ్రి అచ్చిరెడ్డి గ్రామం మాదాపురం ఐదుగురు వ్యక్తులు తనను కిడ్నాప్ చేసి చంపుతామని బెదిరించడం జరిగినదని అట్టి భూమిలో మార్చి, 2022న కొనిజర్ల తహశీల్దారు కార్యాలయంలో 10.24 ఎకరాల భూమిని గాంధీ సంజీవరెడ్డి పేరున అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని అట్టి విషయంలో విచారణ జరిపి వారిపై చట్టరిత్యా చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయవలసినదిగా సమర్పించిన దరఖాస్తును పోలీసు కమీషనర్ ఖమ్మంకు పరిశీలన నిమిత్తం పంపియున్నారు. ఖమ్మం రూరల్ మండలం తెల్దారుపల్లికి చెందిన నూకల ఉమాదేవి, భర్త వీరబాబు తాను మీ సేవా కేంద్రంకు తెల్దారుపల్లి గ్రామానికి దరఖాస్తు చేసుకోవడం జరిగినదని, ఈ-గవర్నెన్స్ సొసైటీ పేరుతో 10 వేల రూపాయలు డి.డి. తీసి, కలెక్టర్ వారి కార్యాలయంలో ఇవ్వడం జరిగినదని నోటిఫికేషన్ మారినందున గతంలో జారీచేసిన నోటిఫికేషన్ రద్దు చేసి డిడి కట్టిన నగదును తిరిగి ఇప్పించగలరని సమర్పించిన దరఖాస్తును తగు చర్య నిమిత్తం కలెక్టరేట్ కార్యాలయపు ఏ.ఓ.కు సూచించినారు. కొణిజర్ల మండలం పల్లిపాడు గ్రామంకు చెందిన డి. ఉపేందర్‌రావు తాను గత జూలై లో బ్రౌన్స్ కాలనీ ఎదురుగా ఉన్న ఇండెన్ పెట్రోల్ బంక్ నందు పెట్రోలు పోయించుకోవడం జరిగినదని అట్టి పెట్రోలులో నీరు కలవడం వలన తన ఆటో పాడయిపోయినదని, అట్టి పెట్రోలు బంకు యజమాన్యంపై చర్యలు తీసుకోగలరని సమర్పించిన దరఖాస్తును తగు చర్య నిమిత్తం జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారికి సూచించినారు. ఈ "గ్రీవెన్స్ డే" జిల్లా రెవిన్యూ అధికారిణి ఎం. రాజేశ్వరి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు చదువుతో క్రీడల పట్ల కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలి

## - సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

## - విద్యార్థులు ఇలాంటి క్రీడా పోటీలను వేదికలుగా చేసుకొని తమ ప్రతిభను చాటాలి





సికింద్రాబాద్ జిల్లా, తెలంగాణ ముచ్చట్లు : సోమవారం అమీర్ పేట లోని మున్సిపల్ గ్రౌండ్ లో మూడు రోజులపాటు నిర్వహించే తలసాని శంకర్ యాదవ్ స్మారక క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించారు. ముందుగా శంకర్ యాదవ్ చిత్రపటం వద్ద పూలు సమర్పించి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే శ్రీనివాస్ యాదవ్ బ్యాట్ పట్టి క్రికెట్ ఆడి పోటీలకు హాజరైన విద్యార్థులను ఉత్తేజపరిచారు. తన సోదరుడు, మోండా మార్కెట్ అధ్యక్షులు తలసాని శంకర్ యాదవ్ జ్ఞాపకార్థం క్రికెట్ పోటీలను నిర్వహించడం పట్ల నిర్వహకులను అభినందించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు ఆరోగ్యానికి ఎంతో దోహదం చేస్తాయని, క్రీడలలో కూడా రాణించాలని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను ఆసక్తి కలిగిన క్రీడలలో ప్రోత్సహించాలని కోరారు. విద్యార్థులు ఇలాంటి క్రీడా పోటీలను వేదికలుగా చేసుకొని తమ ప్రతిభను చాటాలని అన్నారు. క్రీడలకు ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడం వలన ఒలంపిక్స్ వంటి అంతర్జాతీయ పోటీలలో క్రీడాకారులు రాణించలేకపోతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నామన శేషకుమారి, బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు హన్మంతరావు, నాయకులు అశోక్ యాదవ్, కూతురు నర్సింహ, బలరాం, వనం శ్రీనివాస్, నిర్వహకులు సచిన్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్దమందడి లో స్వచ్ఛతనం-పచ్చదనం కార్యక్రమం





వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు : వనపర్తి జిల్లా పెద్దమందడి మండల కేంద్రంలో ఎంపీడీవో సద్గుణ ఆధ్వర్యంలో నూతనంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్వచ్ఛతనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సోమవారం రోజు మండల కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. శుభ్రత పరిశుభ్రత పై ప్రజలు అప్రమత్తతో పాటించాలని ఎంపీడీవో సద్గుణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సద్గుణ మాట్లాడుతూ... వాతావరణ మార్పులకు అనుగుణంగా కార్బన్ డయాక్సైడ్ లాంటి విషవాయువులను తొలగించి మానవతవాళి ఆరోగ్య శ్రేయస్కరణకు అనుగుణంగా ఆరోగ్యపరంగా ప్రకృతి ఆహ్వాదించే ఆక్సిజన్ వాయువులను పెంచుకునేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి నాటిన మొక్కలను బాధ్యతగా రక్షించుకొని ప్రకృతిని కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని వారు తెలిపారు. మొక్కలను నాటి స్వచ్ఛతరం-పచ్చదనం కార్యక్రమంలో భాగం పంచుకోవాలని వారు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ వేణు గోపాల్ ఎంపీడీవో సద్గుణ తహసిల్దార్ చక్రపాణి ఎంపీఓ పుష్ప ఆర్ఐ తిరుపతయ్య ఏపిఎం నాగమణి సింగిల్ విండో అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి పోలీసు అధికారులు ఏఎన్ఎం ఆశ వర్కర్లు అంగన్వాడి ఉపాధ్యాయురాలు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కులగణనతోనే దేశంలో విప్లవాత్మక మార్పులు

## - కులగణనను విస్మరిస్తే దేశంలో బంగ్లాదేశ్ పరిస్థితులు

## - ఎస్సీ ఎస్టీల వర్గీకరణ తరువాత జరగాల్సింది దేశంలో కులగణననే

## - సంపద అంతా ఒకశాతం సంపన్నులవద్ద కేంద్రీకృతం

## - కొనసాగుతున్న ఆర్థిక అసమానతలతో దేశంలో అంతర్యుద్ధ ప్రమాదం

## - సమస్యల సాధనకై బీసీ రాజ్యాధికార సమితి ఢిల్లీ బాట

## - బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షులు దాసు సురేశ్



హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు : దేశవ్యాప్తంగా బీసీల,అణగారిన వర్గాల అభివృద్ధి పట్ల ప్రభుత్వం సరైన దృష్టి సారించకపోవడం వల్లనే దేశంలో ఆర్థిక అసమానతలు, ఆకలి చావులు తీవ్రమవుతున్నాయని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షులు దాసు సురేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ దయనీయ పరిస్థితులను అధిగమించడానికి బీసీల సంఘటిత శక్తిని బలోపేతం చేసి జటిలమవుతున్న సమస్యల పరిష్కార సాధన కోసం కార్యాచరణను సిద్ధం చేసే క్రమంలో భాగంగా ఈనెల 6 తేదీ నుండి 10 తేదీ వరకు బీసీ రాజ్యాధికార సమితి ముఖ్య కార్యవర్గం ఢిల్లీ బాట పట్టనుందని దాసు సురేశ్ తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా పార్లమెంటులోని అన్ని ప్రాంతీయ పార్టీల ఫ్లోర్ లీడర్లకు దేశంలో కొనసాగుతున్న ఆర్థిక అసమానతలకు సంబంధించిన నివేదికలను అందించనున్నామని దాసు సురేశ్ తెలిపారు. అదేవిధంగా జవహర్లాల్ నెహ్రూ యూనివర్సిటీ, ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థి నాయకులు, బిసి దళిత ఉద్యోగ, న్యాయవాద, జర్నలిస్టు సంఘాల నాయకులతో సమావేశాలను నిర్వహించి తమ తదుపరి ఉద్యమ కార్యాచరణను సిద్ధం చేయనున్నామన్నారు. దేశ మూలవాసులు, బలహీనవర్గాల ఆకాంక్ష అయిన కులగణనతో కూడిన జాతి జనగణన, బీసీలకు చట్టసభల్లో ప్రాథమికంగా 27% రిజర్వేషన్లను వచ్చే ఎన్నికల నుండే అమలుపరిచే విధంగా అవసరమైన రాజ్యాంగ సవరణ, బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ, మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా, బడ్జెట్లో బీసీలకు 10 లక్షల కోట్ల సబ్ ప్లాన్ , ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల ఎత్తివేత లేదా ఆర్థికంగా వెనుకబడ్డ అన్ని వర్గాలకు ఈ కోటా అమలుతో బాటు తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ రిజర్వేషన్ల పెంపు తదితర అంశాలను ప్రధాని ప్రధాని మోడీ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ దృష్టికి తీసుకువెళ్లేలా ప్రయత్నాలను ఢిల్లీలో ముమ్మరం చేయనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ తులసి శ్రీమన్, మీడియా సెక్రెటరీ మారేపల్లి లక్ష్మణ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎలగందుల మల్లేష్ నేత, మహబూబ్నగర్ జిల్లా ఇన్చార్జ్ రాజు ముదిరాజ్, యూత్ జనరల్ సెక్రెటరీ ఉరుకొండ శివ, సీనియర్ జర్నలిస్టు దుర్గం శ్రీనివాస్ బాటు 50 మంది నాయకులు వివిధ ప్రాంతాల నుండి పాల్గొననున్నారని దాసు సురేశ్ తెలిపారు.

# స్వచ్ఛ దనం - పచ్చదనంలో మొక్కలు నాటిన జీహెచ్ఎంసి డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి



సికింద్రాబాద్, తెలంగాణ ముచ్చట్లు : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 5 వ తేదీ నుండి 9 వ తేదీ వరకు స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమాన్ని 5 రోజుల పాటు గ్రామీణ, పట్టణాల్లో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో నేడు మొదటి రోజును పురస్కరించుకొని తార్నాక డివిజన్ లోని నాగార్జున నగర్ కాలనీ పార్క్ లో సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవి కిరణ్ గారు మరియు టీటీయూసి ప్రెసిడెంట్, కాంగ్రెస్ నేత మోతె శోభన్ రెడ్డి గార్లతో కలిసి మొక్కలు నాటిన డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి. గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో పరిశుభ్రత, పచ్చదనాన్ని ప్రోత్సహించడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి స్వచ్ఛదనం -పచ్చదనం కార్యక్రమాన్ని ప్రారంభించిందని డిప్యూటి మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ప్రతి ఇంటింటికి మొక్కలను పంపిణీ చేస్తున్నామని అన్నారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి శుభ్రం చేసి ప్రజలకు ఎలాంటి వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా చూడాలని తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక

# బాధితులకు సహాయాన్ని అందించి అండగా నిలవండి..

## - ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి









రాజేంద్రనగర్, **తెలంగాణ ముచ్చట్లు :** కేరళలోని వయనాడ్ వరద బాధితులకు సహాయం చేసేందుకు ఆదివారం ఎఐటియుసి రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం విరాళాలు సేకరించారు.కేరళలో కొండచరియలు విరిగిపడటంతో జరిగిన విధ్వంసం గురించి వివరిస్తూ..కాటేదాన్ పరిశ్రామిక వాడలో దుకాణాల వద్దకు వెళ్లి విరాళాల సేకరణ చేపట్టారు.పలువురు దాతలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి విరాళాలు అందించారు.ఈ సందర్భంగా వనంపల్లి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ...వయనాడ్ బాధితులను ఆదుకునేందుకు ప్రతిఒక్కరూ మానవతాదృక్పథంలో ముందుకు రావాలని కోరారు.వరద బాధితుల సహాయార్థం మానవత్వం కలిగిన ప్రతిఒక్కరు తోచిన విధంగా ధన,వస్తురూపేన సహాయం అందించాలని సూచించారు.సేకరించిన విరాళాలను రాష్ట్ర నాయకత్వం ద్వారా కేరళ ప్రజలకు అందిస్తామని తెలిపారు.సుమారు 300 పైగా ప్రజలు మరణించారని,అనేకమంది గాయపడ్డారని తమ ఇండ్లను కుటుంబాలను కోల్పోయి నిరాశ్రయులైన వారందరికీ అండగా నిలవాల్సిన అవసరం ఉందని అన్నారు.వరదల నష్టాన్ని జాతీయ విపత్తుగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ మండల సహాయ కార్యదర్శి జె.విజయనందంగౌడ్,జిల్లా కౌన్సిల్ సభ్యులు జె.ఆనంద్ గౌడ్,జె.సదానందం గౌడ్,ఏఐటీయూసీ మండల కార్యదర్శి టి.ఆనంద్, ఏ.రాజు,జి.సాయిలు,పెంటయ్య,హరి,స్వామి, తదితరులు పాల్గొన్నారు.

# మీసేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచి ఉంటాయి

లివి.ఆర్.పురం ప్రతినిధి చింతూరు డివిజన్, **తెలంగాణ ముచ్చట్లు :** ఎన్నికల విధుల్లో,వరద సహాయ సహకారాల్లో(మీరు) తహాశీల్ధార్%ల%ఎగ్జిక్యూటివ్ మేజిస్టేట్ సయ్యద్ మౌలానా ఫాజిల్,చేసిన అద్భుతమైన సేవలు, ఏజెన్సీలోని వరరాచంద్రాపురంలోచిరస్థాయిగా నిలిచే ఉంటాయని వివేకానంద ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్ష కార్యదర్శిలు,మసక పల్లి సత్తిబాబు,కప్పల కృపారావు, స్పష్టంచేశారు.సోమవారం రెవిన్యూ కార్యాలయంలోని,తహాశీల్ధార్%ల%ఎగ్జిక్యూటివ్ మేజిస్టేట్ చాంబర్ లో సయ్యద్ మౌలానా ఫాజిల్,ను ఘనంగా సన్మానించారు.స్వీట్ బాక్స్ అందించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ!మీరు పనిచేసిన సమయం చాలా తక్కువైనా ఆరు మాసాలు చేసిన సేవలు ఆరేళ్ళ గుర్తుండేలా చేశారని అన్నారు.వరదల సందర్భంగా నిద్రలేని రాత్రులు గడిపి వరద బాధితులకు అద్భుతమైన సేవలందించారని వారుగుర్తు చేశారు.ఏ గ్రామాల్లోకి వెళ్లినా!తహాశీల్ధార్ తెలియని వ్యక్తులు లేరని వారు తెలిపారు.వరదల్లో చిక్కుకున్న వారిని కాపాడి,మీ ఉద్యోగాయానికి పేరు ప్రతిష్టలు తీసుకు వచ్చారని వారు తెలియజేశారు.భారీ వర్షాలతో అల్లాడుతున్న రోగులకు అండగా!నిలిచి వైద్యులు అందించేందుకు మీరు చేసిన ప్రయత్నాలు,ఆఘనత మీకే సొంతమని,వారుస్పష్టంచేశారు. అడిగిన వారికీ,అడగని వారికీ,వరద సహాయంఅందించి,డిపార్ట్మెంట్







కి మంచి గుర్తింపుతోపాటు రాబోవు అధికారులకు ఆదర్శంగా నిలిచారని వారన్నారు.ఈ సన్మాన కార్యక్రమంలో కమిటీ మెంబర్స్ గూటాల వెంకటేశ్వర్లు,బావి నాగేశ్వరరావు,గోలి వికాస్,బియ్యన సురేష్,బండి మహేష్,నాగేంద్రబాబు, తదితరులు హాజరయ్యారు.

# పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్, రియంబర్స్ మెంట్ తక్షణమే విడుదల చేయాలి


## - పి డి ఎస్ యు ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ కు వినతి

ఖమ్మం ,**తెలంగాణ ముచ్చట్లు :** ఖమ్మం జిల్లాకు ప్రాతినిత్యం వహిస్తున్నా ముగ్గురు మంత్రులు కూడా యూనివర్సిటీ గురించి మాట్లాడారా? విద్యారంగ సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే కెసిఆర్ ను తెలంగాణ సమాజమంతా ఎలా విస్మరించిందో అదే గతి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి పడుతుందని పి డి ఎస్ యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ లు హెచ్చరించారు. స్థానిక కాల్వోడ్డు నుండి జూబ్లీక్లబ్, మయూరి సెంటర్, పాత బస్టాండ్, మీదుగా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ దగ్గర సిగ్నల్స్ వరకు వేలాది మంది విద్యార్థులతో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించడం జరిగింది. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని పి డి ఎస్ యు ప్రతినిధి బృందం అదనపు కలెక్టర్ మధుసూదన్ గారికి అందించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖమ్మం జిల్లా ప్రజల చిరకాల వాంఛ అయినటువంటి జిల్లా జనరల్ యూనివర్సిటీ హామీని జిల్లా నుండి ముగ్గురు మంత్రులు ఉండి కూడా కనీస ప్రస్తావన తీసుకురాకపోవడం, యూనివర్సిటీ ఏర్పాటు పట్ల చిత్తశుద్ధితో ముందుకు దుర్మార్గమన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగా అభివృద్ధి కోసం కృషి చేస్తామని ఎన్నికల సందర్భంగా హామీలు ఇచ్చి బడ్జెట్లో 15% నిధులు కేటాయిస్తామని చెప్పి కేవలం 7.8% నిధులు మాత్రమే కేటాయించడం దుర్మార్గం అన్నారు. గత ప్రభుత్వం విడుదల చేయనటువంటి ఫీజు రేయంబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలను ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు పూర్తి అయిన కనీసం విడుదల చేసిన దాఖలాలు లేవన్నారు. వసతి గృహ విద్యార్థులు అర్ధాకలతో అలమటిస్తా ఉన్నారు. వసతి గృహ విద్యార్థులు అర్ధాకలతో అలమటిస్తూన్నారు. పెరిగిన ధరలతోవసతి గృహ విద్యార్థులు అర్ధాకలతో అలమటిస్తున్నారు, పెరిగిన , ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని గతంలో డిమాండ్ చేసిన డిప్యూటీ సిఎం బట్టి గారు నేడు గత ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రకారం మెస్, కాస్మోటిక్ చార్జీలను మీరు ఎందుకు అమలు చేయడం లేదని వారు ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగా బలోపేతంలో కీలకపాత్ర పోషిస్తున్నట్లు చెప్పే ప్రభుత్వం నేడు విద్యార్థులకు ప్రభుత్వ విద్యాసంస్థలలో కనీస వసతులు కల్పించకపోవడం శోచనీయమన్నారు.

### రాష్ట్రాన్ని పచ్చదనం తో పాటు పరిశుభ్రంగా వుంచడమే

# కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

## - రాష్ట్ర మార్క్ఫెడ్ డైరెక్టర్, డి సి ఎం ఎస్ చైర్మన్ కొత్వాల




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, **తెలంగాణ ముచ్చట్లు :** తెలంగాణా రాష్ట్రాన్ని పచ్చదనంతో పాటు పరిశుభ్రంగా వుంచడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తున్నదని డిసిఎంఎస్ చైర్మన్, రాష్ట్ర మార్క్ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ నెల 5 తేదీ నుండి 9 తేదీ వరకు చేపట్టిన స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమాన్ని డి సి ఎం ఎస్ చైర్మన్, రాష్ట్ర మార్క్ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు ప్రారంభించారు. పాల్వంచ మండలం పరిధిలోని జగన్నాధపురం గ్రామంలో సోమవారం అధికారికంగా నిర్వహించిన పలు కార్యక్రమాల్లో కొత్వాల పాల్గొన్నారు. గ్రామంలో ప్రజలు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో ర్యాలీ నిర్వహించారు. శ్రమదానం చేసి, చెత్తను ఎత్తివేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయంలో సభను నిర్వహించారు. సభలో కొత్వాల మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పచ్చదనం, పరిశుభ్రతను ప్రోత్సహించడం ద్వారా జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి దోహదమవుతుంది అని అన్నారు. ఇంటింట మొక్కలు నాటి పచ్చదనాన్ని మెరుగుపరచాలన్నారు. నివాస ప్రాంతాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా వుంచాలని, ప్రజల్లో చైతన్యం కలిగించేలా అధికారులు కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి తిరుపతయ్య, జడ్పీటిసి సభ్యులు బరిపాటి వాసుదేవరావు, ఎండిఓ కే. విజయభాస్కర్ రెడ్డి, పంచాయతీ ప్రత్యేక అధికారి బి. నారాయణ, మూడ్ ఉషారాణి, మండల విద్యాధికారి శ్రీరామ్మూర్తి, ఉపాధి హామీ పిఓ రంగా, పంచాయతీ సెక్రటరీ సాయి రామ్, మాజీ సర్పంచ్ అనిత, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కోండం వెంకన్న, స్థానిక నాయకులు బండపల్లి వెంకటనారాయణ, కోండం పుల్లయ్య, బిచ్చా నాయక్, పైడిపల్లి మహేష్, కామాచారి, బాలాజీ నాయక్, చారి తదితరులు పాల్గొన్నారు.

# విశాఖలో మిస్సయిన యువకుడు చంద్ర కాంత్ అరకులో శవంగా

విశాఖపట్నం, **తెలంగాణ ముచ్చట్లు :** విశాఖపట్నం కంచరపాలెం చెందిన చంద్రకాంత్ అనే యువకుడు విశాఖ లో మిస్ అయి అరకు బొందుగూడ చెరువులో శవంగా తెలియాడుతూ కనిపించాడు విశాఖ కంచరపాలెం కి చెందిన చంద్రకాంత్ అనే యువకుడు గత కొద్దిరోజుల క్రితం కనిపించకుండా పోవడంతో యువకుడు తండ్రి కోటేశ్వరరావు విశాఖ,అరకు, డుంబ్రిగుడ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు ఈ మేరకు దర్యాప్తు చేస్తున్న పోలీసులకు యువకుడు చంద్రకాంత్ అరకు,బొందుగుడ గ్రామ సమీపంలోని చెరువులో శవ మై తేలియాడుతున్నట్లు సమా చారం అందింది దీంతో సిఐ సిహెచ్ రుద్రశేఖర్ నేతృత్వంలో పోలీస్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటికి తీసి మృతికి గల కారణాలపై దర్యాప్తును చేస్తున్నారు కాగా చెరువులో లభ్యమైన మృతదేహం చంద్రకాంత్ దిగా యువకుడు తండ్రి కోటేశ్వరరావు గుర్తించారు.

# పచ్చదనం-స్వచ్ఛదనంతోనే మానవాళికి మనుగడ

**-ప్రభుత్వ కార్యక్రమాన్ని పండువలా జరపాలి**

**-కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు**

**శ్రీనగర్ కాలనీలో పచ్చదనం-స్వచ్ఛదనం కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే**





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి **తెలంగాణ ముచ్చట్లు :** పచ్చదనం, స్వచ్ఛదనం'తోనే సమస్త మానవాళి మనుగడ సాధ్యమవుతుందని, కలుషిత వాతావరణంతోనే విపత్కర పరిస్థితులు, ప్రకృతి విపత్తులు ఏర్పడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'పచ్చదనం-స్వచ్ఛదనం' కార్యక్రమాన్ని లక్ష్మీదేవిపల్లి మండలం, శ్రీనగర్ కాలనీలో సోమవారం ఆయన ప్రారంభించారు. గ్రామంలో మొక్కలు నాటిన అనంతరం శ్రమదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటైన ప్రారంభోత్సవ సభలో కూనంనేని మాట్లాడుతూ మొక్కలు నాటడం, పరిసరాలను పరిశుభ్రం చేయడం కేవలం ప్రభుత్వ కార్యక్రమంగానే భావించొద్దని, ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకుంటే పచ్చదనం, స్వచ్ఛదనం కల సాకారం అవుతుందన్నారు. కొద్దిరోజులకు కార్యక్రమాన్ని పరిమితం చేయడం వల్ల ఆశించిన లక్ష్యాలకు చేరుకోలేమని, నిత్య ప్రక్రియగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించుకోవాలన్నారు. చెట్లు నరకడం వల్ల వచ్చే ఇబ్బందులపై ప్రధానంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ చలపతిరావు, ఎంపిఓ శ్రీనివాసరావు, ఆర్ డబ్ల్యూఎస్ ఎస్ ఏ ఈ వెంకటస్వామి, సిపిఐ జిల్లా కార్యదర్శి, కొత్తగూడెం మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్ కె సాబీర్ పాషా, ఎంపిటిసి కొల్లు పద్మ, మాజీ ఉప సర్పంచులు లగడపాటి రమేష్, చింత నాగమణి, స్థానికులు తాళ్లూరి వెంకటేశ్వర్ రావు, పూనెం శ్రీనివాస్, వట్టి సాంబశివరావు, నేరెళ్ల రమేష్, ఆఫ్జల్, గౌస్ పాషా, అన్వర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
TELTEL12273
తెలుగు దిన పత్రిక





# వరదల్లో ఇబ్బంది పడ్డ ఉద్యోగస్తులకు 3000 రూపాయలు చెల్లించాలి

## - సి.పి.ఎం,పార్టీ వినతి

వి.ఆర్.పురం,,తెలంగాణ ముచ్చట్లు : వరరాచంద్రాపురం మండలంలోని వరదల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొన్న ఉద్యోగస్తులకు 3000/- రూపాయలు తక్షణమే ఇవ్వాలని,మండల తహసీల్దార్ కు సి.పి.ఎం, పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది.సోమవారం ఈ సందర్భంగా సి.పి.ఎం.పార్టీ నాయకులు మాట్లాడుతూ వరదల్లో ఇల్లు మొత్తం కూడా నీట మునిగి అనేక అవస్థలు ఎదుర్కొన్న ప్రజానికానికి ప్రభుత్వం 3000/- రూపాయలు ఆర్థిక సహాయాన్ని చేసిందని, అదేవిధంగా ఉద్యోగస్తులు ఇల్లు కూడా నీట మునిగాయని వారు ఇబ్బందులు ఎదుర్కొన్నారని వారికి కూడా తక్షణమే వరదల్లో ఇచ్చిన ఆర్థిక సహాయం 3000/- రూపాయలు ఇవ్వాలని సి.పి.ఎం,పార్టీ మండల కమిటీ మండల తాసిల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్ ను విజ్ఞప్తి చేశారు. తహసిల్దార్ కు వినతి పత్రం అందించిన వారిలో సి.పి.ఎం,పార్టీ మండల కార్యదర్శి సోయం చిన్నబాబు,జిల్లా నాయకులు పూనెం సత్యనారాయణ,మండల ఎం.పీ.పీ, కారం.లక్ష్మి, నాయకులు పంకు సత్తిబాబు,పులి.సంతోష్ కుమార్,కారం సుందరయ్య, కమ్మచిచ్చు సత్తిబాబు,సోడి మల్లయ్య,నాళ్లారపు చందర్రావు, తదితరులు ఉన్నారు.

# చౌదర్ గూడా గ్రామంలో పార్టీ గులాబీ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం

## - హాజరైన పిఎసిఎస్ చైర్మన్ డిసిసిబి డైరెక్టర్ బోర్కుంట సతీష్



శంషాబాద్ తెలంగాణ ముచ్చట్లు : శంషాబాద్ మండల పరిధిలోని చౌదరిగూడ గ్రామంలో టిఆర్ఎస్ పార్టీ ముఖ్య నేతల సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పిఎసిఎస్ చైర్మన్ డిసిసిబి డైరెక్టర్ బోర్కుంట సతీష్ హాజరయ్యారు. మరియు టిఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రెటరీ మోహన్ రావు కో ఆప్షన్ సభ్యులు గౌస్ భాయ్ టిఆర్ఎస్ పార్టీ యూత్ ప్రెసిడెంట్ రాజశేఖర్ గౌడ్, కొనమల శ్రీనివాస్, మండల పార్టీ నాయకుల సమక్షంలో చౌదర్ గూడా గ్రామం టిఆర్ఎస్ పార్టీ ఇన్చార్జిగా కొమ్ము గోపాల్ ని ఎన్నుకోవడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో వార్డు సభ్యుడు బక్క ప్రశాంత్, అనంతుల రమేష్, తాళ్ల ఆంజనేయులు, ప్రేమ్ రాజ్ సంతోష్, కుమార్, మునగాల శ్రీశైలం, కొమ్ము జంగారావు, భక్త సుధాకర్, పొగాకు మహేష్, మల్చలం రాము, బక్క నవీన్, టిఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తలు పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా బోర్ కుంట సతీష్ మాట్లాడుతూ...బుర్గుంట సతీష్ మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు ఎవరు అదేపడవద్దని కార్యకర్తలకు అండగా మేము ఉంటామని చెప్పడం జరిగింది అదేవిధంగా రాబోయే స్థానిక ఎన్నికల్లో అందరూ ఐకమత్యంగా ఉండి పార్టీ విజయానికి తోడ్పడాలని గ్రామంలో టిఆర్ఎస్ పార్టీ జెండా ఎగరవేయాలని చెప్పడం జరిగింది.

# స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో ఎం.బి.ఎ. మరియు ఎం.సి.ఎ. విద్యార్థులకు ఆర్థిక స్వేచ్ఛ అనే అంశము మీద గెస్ట్ లెక్చర్

గుడివాడ,తెలంగాణ ముచ్చట్లు : రిసోర్స్ పర్సన్ గా జి.సుధాకర్, ఫ్రీ లాంసర్, స్టాక్ మార్కెట్ నుంచి విచ్చేసారు. ఆయన మాట్లాడుతూ యుక్త వయసునుంచే విద్యార్థినీ, విద్యార్థులు వివిధ రంగాలలో పెట్టుబడి పెట్టడం మీద అవగాహన పెంచుకోవాలని మరియు సెక్యూరిటీసులో పెట్టుబడి పెట్టేముందు ఎలా పెట్టాలి ఎప్పుడు పెట్టాలని బాగా అలోచించి స్టాక్ బ్రోకర్స్ యొక్క సలహాలు సూచనలు పరిగణనలోకి తెసుకోవాలని పేర్కొన్నారు. అలాగే మార్కెట్లో బ్యాంక్స్ నుంచి లభించే అప్పులమీద అవగాహనా పొందాలి. అధ్యాపకులు మరియు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉద్యమకారులను తెలంగాణ సమరయోధులుగా గుర్తించాలి

- నాటి ఉద్యమకారుల త్యాగం మరువలేనిది
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి తెలంగాణ ముచ్చట్లు : ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను రేకెత్తించి 1969 ఉద్యమకారులను తెలంగాణ సమరయోధులుగా గుర్తించి వారిని అన్నివిధాలా ఆదుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 1969 తెలంగాణ ఉద్యమంలో ఆగస్టు 5న జరిగిన పోలీసుల కాల్పుల్లో మృతిచెందిన కె రాంచందర్, ఎండి దస్తగిరి సంతాప సభ సందర్భంగా సోమవారం బస్టాండు సెంటరులోని అమరవీరుల స్తూపం వద్ద నాటి ఉద్యమకారులతో కలిసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సంతాపసభలో కూనంనేని మాట్లాడుతూ వివక్షతకు గురవుతున్న తెలంగాణలో 1969లో జరిగిన ప్రత్యేక రాష్ట్ర ఉద్యమమే 2009లో తారాస్థాయిలో ప్రారంభమైన ఉద్యమానికి స్ఫూర్తి అని అన్నారు, నాడు ఉద్యమంలేకుంటే తెలంగాణ రాష్ట్రము ఏర్పడేదే కాదన్నారు. తెలంగాణ ఉద్యమానికి భీజం పోసిన నాటి ఉద్యమకారులని తెలంగాణ సమరయోధులుగా గుర్తించి పెన్షన్, గృహవసతి, రైతులు అందించి ఆదుకోవాలని కోరారు. ఉద్యమకారులు ఆశిర్వాదం, రామకృష్ణ మూర్తి, కొల్లేటి రాందాసు తదితరుల విగ్రహ ప్రతిష్టకు స్థలం కేటాయించేందుకు అధికారులకు సిఫారసు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, గొల్లపల్లి దయానందరావు, మ్యాథ్యూస్, కందుకూరి మదనయ్య, కూచన కృష్ణారావు, తాండ్ర కృష్ణార్జునరావు, అబ్బు రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

# శంషాబాద్ లో స్వచ్ఛదనం పచ్చదనం ప్రచారంలో పాల్గొన్న బండి గోపాల్



శంషాబాద్ తెలంగాణ ముచ్చట్లు : ప్రభుత్వం ఇచ్చిన పిలుపులో భాగంగా సోమవారం శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని అన్నివార్డుల కౌన్సిలర్స్ తో కలసి ప్రభుత్వం ఏంతో ప్రతిష్టత్మాకంగా చేపట్టిన ఈకార్యక్రమాన్ని బ్యానతో మున్సిపల్ పరిధిలో విశ్వతంగా ప్రచారం నిర్వహించారు మున్సిపల్ వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్. స్వచ్ఛదనం పచ్చదనం ఈ కార్యక్ర మాన్ని విజయవంతం చేస్తే మన పరిసరాలను మనము పరిశుభ్రంగా చేసుకోవడమే కాకుండా ఎంతో మేలు జరుగుతుందని బండి గోపాల్ యాదవ్ అన్నారు.స్వచ్ఛదనం పచ్చదనం విజయవంతం చేయడం మన ప్రతి ఒక్కరిపై బాధ్యత ఉందని ఆయన గుర్తు చేశారు.ఈ ప్రచార కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు కవిత ప్రసాద్,ప్రభాకర్,కౌన్సిలర్లు జాంగిర్ ఖాన్, అజయ్ కుమార్, ఆయిల్ కుమార్, బుచ్చిరెడ్డి, కొనమల్ల శ్రీనివాస్,శ్రీకాంత్ యాదవ్,స్రవంతి శ్రీకాంత్ రెడ్డి,మేకల వెంకటేష్,అశోక్, పార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

**రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో .....** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాలలో నిర్వహించిన కార్యక్రమంలో సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్ తో పాటు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ స్వచ్ఛదనం పచ్చదనం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని ఎమ్మెల్యే తెలిపారు.ఈ సందర్భంగా శానిటేషన్ సిబ్బంది ఇతర అధికారులు, పలు పార్టీల నేతలతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. మన పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవడమే ఈ యొక్క కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు. ప్రతి ఒక్కరూ మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ముందుకు రావాలన్నారు. వనమహోత్సవాన్ని విజయవంతం చేసినట్లుగానే కార్యక్రమాన్ని కూడా అధికారులు ప్రజలు విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ రవికుమార్ తో కలిసి పలు ప్రాంతాలలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మైలార్దేపల్లి డివిజన్ ప్రాంతానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

# జల్ పల్లి లో ఘనంగా బోనాలు

## బోనలా వేడుకలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు




జల్ పల్లి తెలంగాణ ముచ్చట్లు : జల్ పల్లి మున్సిపల్ పరిధిలో గల 16వార్డులో బోనలా పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించారు.పోతురాజుల విన్యాసాలు. యువతీయువకుల కేరింతలా మధ్య మహిళలు అమ్మవారికి బోనలా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.బోనలా పండగ వాతావరణంలో ఊరి మహిళలు, ఆడపడుచులు భోనాలు సమర్పించిన తమ కోరికలు నెరవేరాలని మొక్కుకున్నారు. బోనంలో తీసుకోచ్చిన నైవేద్యలను అమ్మవారికి సమర్పించారు. పహాడి షరీవ్ పోలీసులు అవాంఛసంఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్త్ నిర్వహించారు. 16వార్డ్ కౌన్సిలర్ బుడమాల యాదగిరి, మాజీ సర్పంచి షేక్ జహంగీర్, 16వార్డ్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి యంజాల శ్రీనివాస్ లు మాట్లాడుతూ.... తరతరాలుగా జల్ పల్లి గ్రామంలో బోనలా పండుగను వైభావంగా నిర్వహించడం అనవహితీ వస్తుందని అన్నారు. సంవత్సరమంతా ప్రజలకు ఎలాంటి వైరస్ లు సోకకుండా కాచికాపాడమ్మా అని అమ్మవారిని వేడుకున్నారు.

# సింగరేణి సేవా సమితి ద్వారా వృత్తి శిక్షణ పొందిన మహిళలకు పరీక్షలు




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి , తెలంగాణ ముచ్చట్లు : ఆగస్టు 05:2023-24 సంవత్సరంలో సింగరేణి సేవాసమితి కొత్తగూడెం ఏరియా ఆధ్వర్యంలో ఫ్యాషన్ డిజైనింగ్, టైలరింగ్, బ్యూటీషి యన్, మగ్గం వర్క్ మొదలగు వృత్తి శిక్షణ కోర్సులను పూర్తి చేసిన మహిళలు ఈ నెల 07వ తేదీ ఉదయం 09.30 గంటల నుండి 12 గంటలవరకు ఆర్.సి.ఓ.ఏ క్లబ్ రుద్రంపూర్ లో జరిగే పరీక్షలకు తప్పకుండా హాజరు కావాలని, ఈ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్ధిని లకు ఖాదీ గ్రామోద్యోగ్ మహా విద్యాలయ- హైదరాబాద్" వారిచే సర్టిఫికెట్లు అందచేయబడునని జనరల్ మేనేజర్, కొత్తగూడెం ఏరియా ఎం. షాలేం రాజు తెలియ జేశారు.

# కేరళ వయనాడ్ వరద బాధితులను ఆదుకుందాం

## -ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి




రాజేంద్రనగర్ తెలంగాణ ముచ్చట్లు : ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఎఐటియుసి) రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం కేరళ రాష్ట్రంలోని వయనాడ్ ప్రాంతంలో అకాల వర్షాలు, వరదలతో ప్రజలు 350కి పైగా మృతిచెందారని వేలసంఖ్యలో నిరాశ్రయులయ్యారని వారిని ఆదుకోవాలని కోరుతూ షాప్ టు షాపు తిరిగి విరాళాలను సేకరించారు. ఈ సందర్భంగా వనంపల్లి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ. వరద బాధితుల సహాయార్థం మానవత్వం కలిగిన ప్రతిఒక్కరు తోచిన విధంగా ధన, వస్తురూపేన సహాయం అందించాలని కోరారు. సేకరించిన విరాళాలను రాష్ట్ర నాయకత్వం ద్వారా కేరళ ప్రజలకు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ మండల సహాయ కార్యదర్శి జె. విజయనందంగౌడ్ , జిల్లా కౌన్సిల్ సభ్యులు జె.ఆనంద్ గౌడ్ , జె.సదానందం గౌడ్, ఏఐటీయూసీ మండల కార్యదర్శి టి.ఆనంద్ , ఏ.రాజు , జి.సాయిలు, పెంటయ్య, హరి, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

# పాల్వంచ నూతన మున్సిపల్ కమిషనర్ ను మర్యాద పూర్వకంగా కలిసిన కటుకూరి శేఖర్ బాబు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి,తెలంగాణ ముచ్చట్లు : : పాల్వంచ నూతన మున్సిపల్ కమిషనర్ డాకూ నాయక్ ని కటుకూరి అక్షయ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు కటుకూరి శేఖర్ బాబు మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగామున్సిపల్ కమిషనర్ ను పూల దండంతో, శాలువా తో సన్మానించారు. అనంతరం నూతన మున్సిపల్ కమిషనర్ డాకు నాయక్ మాట్లాడుతూ స్వచ్ఛదనం - పచ్చదనం ప్రతి ఒక్కరి భాధ్యత అని,తడి చెత్తను పొడి చెత్తను వేరుగా మున్సిపల్ సిబ్బంది ఆటోల లో వేయాలని ఆదేశించారు. ప్లాస్టిక్ రహిత సమాజన్ని నిర్మించాలని, ప్రతి ఇంట్లో విధిగా చెట్లను నాటలని, వర్షపు నీటిని నిల్వ వుంచ వద్దని నిలువ ఉంచిన నీటిలో దోమలు చేరి డెంగ్యూ, మలేరియా వంటి విష జ్వరాలు ప్రబలే అవకాశలు వున్నాయని అన్నారు. మున్సిపల్ టి.పి.ఓ.సత్యనారాయణ, మున్సిపల్ మేనేజర్ లోగానీ సత్యనారాయణ, అక్షయ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు కటుకూరి వేంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
అనునిత్యం ప్రజల పక్షం
TELTEL12273
ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక



## శ్రీ.శే. తండ్రి క్యాతం కృష్ణమూర్తి జ్ఞాపకర్ధంగా మహిళలకు 30కుట్టుమిషన్లు పంపిణీ

### గొప్ప మనసుతో మహిళలు కూడా ఆర్థికంగా ఎదగాలిలియువ నాయకుడు క్యాతం మధుకృష్ణ

శామీర్ పేట , తెలంగాణ ముచ్చట్లు : మూడుచింతలపల్లి మండలంలోని లక్ష్మా పూర్ గ్రామంలో మాజీ సర్పంచ్ క్యాతం కృష్ణ మూర్తి జ్ఞాపకర్ధంగా వారి కుమారుడు క్యాతం మధుకృష్ణ లక్ష్మాపూర్ గ్రామంలోని డ్వాక్రా భవనంలో మహిళలకు 30 కుట్టు మిషిన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొప్ప మనసుతో మహిళలు కూడా ఆర్థికంగా ఎదగాలని స్థిరపడాలని ఆలోచించి దాతగా ముందుకు వచ్చి కుట్టు మిషన్ లను పంపిణీ చేయడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో వత్సలాదేవి,పంచాయతీ కార్యదర్శిశోభారాణి,మాజీ సర్పంచ్ ఆంజనేయులు, మాజీ సర్పంచ్ కటికెల శ్యామల, నాయకులు కీసరి నర్సింలు, రవి, బాబుచారి, మహిళ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బస్తీ బాటలో రామకృష్ణ



సికింద్రాబాద్ జిల్లా, తెలంగాణ ముచ్చట్లు : సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు వైస్ ప్రెసిడెంట్ %జీ%. రామకృష్ణ బస్తీ బాట ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. సోమవారం కంటోన్మెంట్ పరిధిలోని ఓల్డ్ మడ్ ఫోర్ట్ ప్రాంతంలో బిజెపి నాయకులతో కలసి పర్యటించారు. అక్కడి సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. తమ దృష్టికి వచ్చిన ప్రతీ సమస్యను పరిష్కరిస్తానని రామకృష్ణ హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి ఎన్ శ్రీనివాస్, అరుణ్, రాజ మల్లేష్, శంకర్, బిజెపి కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

## ఏ.ఎస్.డి.ఎస్,సంస్థ ద్వారా!గృహెూపకరణాలు పంపిణీ

### తహాశీల్దార్&ఎగ్జిక్యూటివ్ మేజిస్టేట్ సయ్యద్ మౌలానా ఫాజిల్







వి.ఆర్.పురం,ప్రతినిధి చింతూరు, తెలంగాణ ముచ్చట్లు : ఏ.ఎస్.డి.ఎస్సంస్థ చైర్మన్ ఉండవల్లి గాంధీబాబు, సారధ్యంలో ధర్మతాళ్ల గూడెం,గ్రామంలో వరద బాధితులకు గృహెూపకరణాలు, తహాశీల్దార్&ఎగ్జికర్యూటివ్ మేజిస్టేట్,సయ్యద్ మౌలానా ఫాజిల్,ఎం.పి.డి.వో,పనింద్ర, చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా తహాశీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్, మాట్లాడుతూ,ఏ.ఎస్.డి.ఎస్,సంస్థద్వారా సుమారు 171 కుటుంబాలకు గృహెూపకరణాల కిట్టు,అందించామని వివరించారు. ఏజెన్సీ ప్రాంతంలో ఏ.ఎస్.డి.ఎస్,సంస్థ సేవలను ఆయన కొనియా డారు. వరదల సమయంలో,సంస్థ ద్వారా ఎన్నో సేవాకార్యక్రమా లు చేశారని ఆయన గుర్తుచేశారు.ఒక్కొక్క గృహెూపకరణాలకిట్టు, సుమారుగా 1200/-రూపాయల ఖరీదుఉంటుందన్నారు.ఈ పంపిణీ కార్యక్రమం లో సంస్థ చైర్మన్ ఉండవల్లి గాంధీబాబు, ఎం.పి.డి.వో, పనిద్ర,జడ్పీ.టి.సి.వాళ్ళ రంగారెడ్డి, స్థానిక సర్పంచ్,ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు,వి.ఆర్.ఓ,సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మాలమహానాడు ఆధ్వర్యంలో ఖమ్మం కలెక్టరేట్ ఎదుట ధర్నా

### - ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి

### - తెలంగాణ మాల మహానాడు



ఖమ్మం,తెలంగాణ ముచ్చట్లు : ఎస్సీ వర్గీకరణ తీర్పును పునర్ పరిశీలించాలని కోరుతూ కలెక్టరేట్ ముందు నిరసన ధర్నా చేయడం జరిగింది ఈ ధర్నాన్ని ఉద్దేశించి ఖమ్మం జిల్లా తెలంగాణ మాల మహానాడు సంఘానికి చెందిన గుంతెటి వీరభద్రం లింగాల రవికుమార్ ముడుసు జాకోబ్ గులగట్టు ఎల్లయ్య చిలకబత్తిని కనకయ్య దామల సత్యం ఆధ్వర్యంలో నిన్న సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణ తీర్పును రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో లేదని క్రితంలో సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. అదే సుప్రీంకోర్టు 2004లో ఇచ్చిన తీర్పును కాదని ఈరోజు రాష్ట్రాలకు ఎస్సీ ఎస్టీ ఏ బి సి డి ల వర్గీకరణ చేసుకోవచ్చని తీర్పునిచ్చింది ఇట్టి తీర్పు రెండు నాలుకుల ధోరణిగా ఉందని అధికార వర్గానికి అండగా ఇచ్చిన తీర్పులుగా ఉంది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 341కి బంగం కలిగించే విధంగా ఈ తీర్పు ఉంది. ఆది కాలములో విడి విడిగా ఉన్న ఎస్సీ కులాలను చదువుకు, నీటికీ, బడికి అంటరానితనం పేరుతో ఊరికి బయట నివసించే ఈ జాతులను సమిష్టిగా ఉండేందుకు షెడ్యూల్ క్యాస్ట్ పేరుతో ఒక దగ్గరకు తీసుకువచ్చి భారత రాజ్యాంగంలో పొందుపరిచారు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్. అలాగే ఎస్టిలైన ఆదివాసులను పై విధముగానే నివసిస్తున్న వారిని ఆర్టికల్ 342 ప్రకారం సమిష్టిగా జీవించేటట్లు ఏర్పాటు జరిగింది. కాబట్టి భారత రాజ్యాంగంలో పొందుపరిచిన ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్లు ఏబిసిడిలుగా వర్గీకరించే హక్కు ఒక పార్లమెంటుకు తప్ప సుప్రీం కోర్టుకు లేదని మనవి చేస్తు జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నా చేయడం జరిగింది. ఎలాంటి కులగనన జరగకుండా నేనే వర్గీకరణ చేస్తానని బాధ్యతారహితంగా మాట్లాడుతున్న ముఖ్యమంత్రి గారు తన మాట వెంటనే వెనక్కి తీసుకోవాలని కోరుతున్నాం ఈ విషయం ప్రభుత్వ దృష్టికి తీసుకుపోవాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో స్టీరింగ్ కమిటీ సభ్యులు కొరివి దయానంద్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు కొట్టే సుధాకర్ ప్రధాన కార్యదర్శి గుమ్మడి కనకరాజు ఉపాధ్యక్షుడు గాదరి బాబు వర్కింగ్ ప్రెసిడెంట్ దాసరి శ్రీనివాస్ ప్రచార కార్యదర్శి జమ్మి వీరబాబు ఎర్ర గంగాధర్ ఖమ్మం నగర వర్కింగ్ ప్రెసిడెంట్ పేర మల్లయ్య ఉపాధ్యక్షుడు తలారి రాధాకృష్ణ కరాటే వేణు చిరంజీవి బిందె రమేష్ బండ్ల నిర్మల జ్యోతి నగర అధ్యక్షుడు తురక నాగేశ్వరరావు దారా సంజీవరావు బి అరుణ చింతల రవి నీరుడు రాంబాబు కల్లూరు శ్రీనివాస్ ఊళ్లోజు ఉదయ్ మీడియా ప్రతినిధులు గుర్రం మనోజ్ పాగా యోనాల తో పాటు జిల్లా కమిటీ సభ్యులందరూ పాల్గొన్నారు.

### 2017 కటాఫ్ డేట్ తో సంబంధం లేకుండా

## తరలించే నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు ఆర్ అండ్ ఆర్ అందజేయాలి

### - ప్రజా పందా డిమాండ్



కుక్కునూరు, తెలంగాణ ముచ్చట్లు : సిపిఐ ఎంఎల్ మాస్ లైన్... ప్రజా పంథా జంగారెడ్డిగూడెం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో, పోలవరం నిర్వాసితులు, పెద్ద వాగు ప్రాజెక్టు వరద బాధితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని, పో డు భూములకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ , ఏలూరు జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ కార్యక్రమంలో, ఏలూరు జిల్లా డి ఆర్ ఓ కి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఇవ్వడం జరిగింది .ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్..ప్రజా పంథా రాష్ట్ర నాయకులు ఎస్.కె గౌస్ మాట్లాడుతూ, వేలేరుపాడు, కు కు నూ రు, జీలుగుమిల్లి,బుట్టాయిగూడెం, జంగారెడ్డిగూడెం జిల్లా వ్యాప్తంగా ఏజెన్సీలో వైరల్ ,మలేరియా, టైఫాయిడ్ , విష జ్వరా ల తోఇబ్బంది పడుతున్నారని, గ్రామాలలో హెల్త్ క్యాంపు లు నిర్వహించి జ్వరా ల ను అరికట్టాలని , గ్రా మా ల్లోదోమల నివా రణకుకొట్టాలని, ఫాగింగ్ చేయా లని,, ఇంటింటి కి దోమ తెరలుఇవ్వా లని,గోదారి వరద ముంపు బాధితులు పనులు లేకుండా ఖాళీగా ఉ న్న వారందరికీ , నిత్యా వ సర వస్తువులు ,కూరగాయలు, , బియ్యం, 3000 రూ పా యలు ఇవ్వాలని ఆయన అన్నారు. పెద వాగు ప్రాజెక్టు వరదలకు భూములలో ఇసుక మేటలు ఏర్పడి భూములు వ్యవసాయానికి పనికి రాకుండా ఉన్నాయని , భూముల్లోఇసుక మేట తీయ డానికి యకరా కు25000/ వేలు రూపాయలు ఇవ్వా లని,వ్యవసాయానికి, మినుములు , పెసర్లు ,కందులు జొన్నలు ,బొబ్బర్లు విత్తనాల ఉచితం గా ఇవ్వాలని, రైతాంగ పాత వ్యవసాయ రుణాలు రద్దుచేసి ,కొత్త రుణాలు ఇవ్వాలని, పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని , వరద ల కు కొట్టుకు పోయిన 3000 పశువులకు ,గొర్రెలకు మేకలకు పదిహేను వేల రూపాయలు గేదెలకు 50 వేల రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లారు. సర్వస్వం కోల్పోయిన ప్రజలందరికీ ఉచితంగా రేషన్ నెల రోజులు ఇవ్వాలని కోరారు. పెద్ద వాగు ప్రాజెక్ట్ కుడి,ఎడమ ప్రధాన కాలువలకు మర మత్తు ల కు, అధి కారులు ఇచ్చి న 94 లక్షల రూ.. లుఎస్టి మేషన్ కు సాంకేతిక మంజూరుఇచ్చి , పనులు ప్రారంభించాలన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోలవరం ముంపు లో ఉన్న ముంపు గ్రామాలను కాంటూరు లెక్కలతో సంబంధం లేకుండామండలం యూనిట్ గా తీసుకోవాలని, 2017 కటప్ డేట్ జీవోను రద్దు చేసి, తరలించే నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు కటాఫ్ డేట్ తో సంబంధం లేకుండా ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని ఎస్.కె గౌస్ పేర్కొన్నారు. పునరావాస కేంద్రాల్లోని జీలుగుమిల్లి బుట్టాయిగూడెం మండలాల్లో మౌలిక సమస్యలు పరిష్కరించాలని, 2006 అటవీ హక్కుల చట్టం కింద పోడు సాగుదారులందరికీ పట్టాలు ఇవ్వాలని, కుక్కునూరు వెంకటాపురం వరకు ఆర్ అండ్ బి రోడ్డు పున నిర్మాణం చేయాలని గుండెటి వాగు పడ్డ గండిని వెంటనే పూడ్చాలని శాశ్వతంగా పనులు చేపట్టాలని ఎస్కె గౌస్ ప్రభుత్వానికి కోరినారు. వాగులకు కొట్టుకుపోయిన ఆర్ అండ్ బి రహదారులను పనులను వెంటనే చేపట్టాలని గ్రామాల్లో ఉన్న మంచినీటి సమస్య తీవ్రత పై మంచినీటి బోర్డు నిర్మించాలని ప్రభుత్వాన్ని సిపిఎంఎల్ మాస్ లైన్ ప్రజా పందా డిమాండ్ చేస్తున్నట్టు ఎస్కె గౌస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులుసిరికొండ రామారావు బి సత్యనారాయణ, కట్టాల ముత్యాలరావు, పార్టీ డివిజన్ నాయకులు కట్నం వీరస్వామి కే ముత్యాలరావు నార్లపురం ఎంపీటీసీ కె రత్తమ్మ, సర్పంచ్ ఎం రంగమ్మ, ఎస్ విజయ తదితరులుపాల్గొన్నారు.



## అలుపెరుగని పోరాట యోధుడు బోడేపూడి

ఖమ్మం, తెలంగాణ ముచ్చట్లు : అమరజీవి బోడేపూడి వెంకటేశ్వరరావు అలుపెరుగని పోరాట యోధుడని సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక సుందరయ్య భవనంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.విక్రమ్ అధ్యక్షతన సిపిఎం సీనియర్ సభ్యులు మరియు మధిర నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు అమరజీవి బోడేపూడి వెంకటేశ్వరరావు గారి 27వ వర్థంతి సభ జరిగింది. తొలుత బోడేపూడి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించిన అనంతరం నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ, ప్రజా ప్రతినిధిగా జీవితంలో అలుపెరుగని రాజకీయ పాత్ర పోషించారన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో బోడేపూడి ప్రముఖ పాత్ర పోషించారన్నారు. ఖమ్మం కమ్యూనిస్టు ఉద్యమంలో చిర్రావూరి, మంచికంటి, రావెళ్ళ గార్ల అనంతరం విప్లవోద్యమంలో ఎనలేని కృషి చేశారన్నారు. అననుకూల పరిస్థితుల్లో కూడా నిస్వార్థంగా ఆదర్శమైన ఉద్యమాలు నిర్మించి పార్టీ బలోపేతానికి కృషి చేశారన్నారు. నేడున్న పరిస్థితులలో పాలకులు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఎంత్కెనా ఉందని, ఈ మార్గంలో నడిచిన బోడేపూడిని ఆదర్శంగా తీసుకొని ప్రజా ఉ ద్యమాలు నిర్వహించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అమరవీరుల వర్థంతి అంటే వారి ఆశయాలను, సిద్ధాంత భావజాలాన్ని తీసుకెళ్ళటమేనని అన్నారు. అమరవీరుల ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల సాధన కోసం జరిగిన అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించిన మహా రైతు నేత బోడేపూడి అని అన్నారు. ప్రజా ప్రతినిధిగా వున్న కాలంలో దళిత, గిరిజన, సన్న, చిన్నకారు రైతుల కోసం వాగులు, యేర్లపై లిఫ్ట్ ఇరిగేషన్లు ఏర్పాటు చేయించి అందరి మన్ననలను పొందిన గొప్ప వ్యక్తి బోడేపూడి గారని కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం అందరూ పాటుపడాలని కార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు యం. సుబ్బారావు, పార్టీ జిల్లా కమిటి సభ్యులు మాదినేని రమేష్, నందిపాటి మనోహర్, పి.ఝాన్సీ, ఆర్. ప్రకాష్, బషీర్, రమ్య, దొంగల తిరుపతిరావు, జిల్లా నాయకులు కత్తుల అమరావతి, రమాదేవి, మురహరి, పడిగల నాగేశ్వరావు, గుమ్మడి బిక్షం, వెంకన్న బాబు, రమేష్, బోడేపూడి విజ్ఞాన కేంద్రం బాధ్యులు వై.శ్రీనివాసరావు, నెల్లూరి వీరబాబు, వాసిరెడ్డి వీరభద్రం, అప్జల్, గోవిందరావు, కె. దేవేంద్ర, రామారావు, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి

### - కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్



సికింద్రాబాద్ జిల్లా, తెలంగాణ ముచ్చట్లు : కాలుష్య నివారణకు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు. సోమవారం 150 డివిజన్లోని టీచర్స్ కాలనీ పార్కులో నిర్వహించిన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరై మొక్కలు నాటారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ మొక్కలు నాటడంతోపాటు అవి భారీ వృక్షాలుగా ఎదిగే వరకు వాటి సంరక్షణకు ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు.. దోమల నివారణ,చెరువుల సంరక్షణ,నాళాల క్లీనింగ్, వనమహెూత్సవం వంటి కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు జిహెచ్ఎంసి తలపెట్టిన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరి భాగస్వామ్యం కావాలన్నారు.. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి అధికారులు మరియు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సినిమా న్యూస్




## షామా స్టన్నింగ్ ఫోటోషూట్ వైరల్



షామా శికందర్ పరిచయం అవసరం లేదు. సోషల్ మీడియా యాక్టివిస్ట్.. ఫోటోషూట్లతో దుమారం రేపడం ఈ అమ్మడి ప్రత్యేకత. నెట్టింట కొత్త ఫోటోషూట్ లతో ఈ బ్యూటీ అగ్గి రాజేస్తుంటుంది. బోల్డ్ డస్కీ లుక్స్ తో హృదయాల్ని టచ్ చేసే ఈ భామ బర్త్ డే నేడు. ఈ సందర్భంగా తన ప్రేమికుడి గురించిన ఎమోషనల్ నోట్ ఇప్పుడు అంతర్జాలంలో వైరల్ గా మారుతోంది. ఈ పోస్ట్ సారాంశం ఇలా ఉంది. ఈ సంవత్సరం సవాలుతో కూడుకున్నదని నాకు తెలుసు.. కానీ మీరు ఒక ఛాంపియన్‌గా దాన్ని ఎదుర్కొన్నారు. నేను మీ కష్టాలు పతనాలను చూస్తున్నాను. నేను మీ బాధను పురోగతిని చూస్తున్నాను.. నేను మీరు చేసే ప్రతిదాన్ని చూస్తున్నాను.. నేను మీ దుర్బలత్వాన్ని చూస్తున్నాను.. నేను మీ ధైర్యాన్ని చూస్తున్నాను.. నేను మీ బలాలు బలహీనతలను చూస్తున్నాను..నేను ఎంతగానో చెప్పలేను.. నీకు విలువ ఇస్తాను, నిన్ను ప్రేమిస్తున్నాను.. నిన్ను గౌరవిస్తాను... నీ అందరితో నేను నిన్ను చూస్తాను!!! మీరు నాకు అత్యంత విలువైనవారు.. మీ ద్వారా ఈ జీవిత అనుభవాన్ని గడపడం అత్యంత ఉత్తేజకరమైన ఆనందదాయకమైన ప్రయాణం. నేను నీతో చాలా ప్రేమలో ఉన్నాను. జీవితాన్ని అత్యంత ప్రామాణికంగా నిజాయితీగా జీవించాలనే మీ ఉత్సుకత నన్ను ఉత్తేజపరచడమే కాకుండా నా హృదయాన్ని నింపుతుంది. నేను మీ ప్రామాణికత, సానుభూతి, చిత్తశుద్ధి, కృతజ్ఞత, దయ, దయ, ధైర్యాన్ని చూస్తున్నాను.. ప్రేమిస్తున్నాను.. గౌరవిస్తాను.. విలువైనదిగా భావిస్తున్నాను. మీరు చాలా ప్రేమ, గౌరవం, నిజాయితీ, విలువ, దయ, కృతజ్ఞతతో మీ లోపల చుట్టూ ఉన్న ప్రతిదీ కలిగి ఉంటారు. మీలాంటి వారిని నేను ఎప్పుడూ చూడలేదు.. మీరు నిజంగా అద్వితీయులు అద్భుతమైనవారు.. మీ సంపూర్ణతకు నేను లొంగిపోతున్నాను.. మీలోని మేధావికి నేను లొంగిపోతున్నాను.. మీలోని దైవత్వానికి నేను నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.. మీరు నా అనుభవంలోకి తెచ్చిన ప్రతి అనుభవంతో మీ ద్వారా ఈ జీవితాన్ని అనుభవించడానికి నేను ఈ ప్రపంచంలో జన్మించినందుకు నేను చాలా కృతజ్ఞురాలిని. నేను మీ గురించి చాలా గర్వపడుతున్నాను. నీ అందానికి నేను చాలా అణకువగా ఉన్నాను నేను మీకు చాలా కృతజ్ఞుడను నేను కావాలని కోరుకునేదంతా నువ్వే మీరు నాకు చాలా ప్రియమైనవారు అంటూ కవితలు అల్లింది షామా... జన్మదిన శుభాకాంక్షలు దేవా బిడ్డ!! అంటూ తనకు తానే బర్త్ డే విషెస్ చెప్పుకుంది.

## అల్లరి స్నేహితులకు ప్రేమతో ఓ ట్విస్ట్



టాలీవుడ్ బిగ్ ప్రొడక్షన్ హౌస్ లో ఒకటైన గీత ఆర్ట్స్ ఇప్పుడు చిన్న సినిమాలను పిక్చర్స్ తో రిలీజ్ చేస్తున్న విషయం తెలిసిందే. నెక్స్ట్ తదుపరి చిత్రంగా "ఆయ్" ను ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతోంది. గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో సాగే కథతో కూడిన ఈ కామెడీ ఎంటర్టైన్మెంట్ చిత్రంలో, యంగ్ టాలెంట్స్ నార్నే నితిన్ ( ఫేమ్) మరియు నయన్ సరికా ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమా ప్రమోషన్ తోనే ఇండస్ట్రీలో మంచి బజ్ క్రియేట్ చేస్తోంది. ఇక ఫైనల్ గా ట్రైలర్ ను విడుదల చేశారు. పిఠాపురంలో ఈవెంట్ నిర్వహించిన మేకర్స్ మంచి ఈ చిత్ర థియేట్రికల్ ట్రైలర్ ను లాంచ్ చేశారు. ట్రైలర్ గమనిస్తే, ఒక చిన్న గోదావరి గ్రామంలో ఉండే ముగ్గురు స్నేహితుల మధ్య జరిగే హాస్యభరిత సన్నివేశాలతో నిండి ఉంది. కర్తీక్ (నార్నే నితిన్), రాజ్‌కుమార్ (కాసిరెడ్డి), హరి (అంకిత్ కొయ్య) అనే ముగ్గురు మిత్రులు "టార్చ్ బేరర్ గ్యాంగ్" గా కొనసాగుతూ ఉంటారు. వీరంతా ఎప్పుడూ ఏదో ఒక పిచ్చి పనిలో తలమునకలై ఉంటారు. ట్రైలర్ ప్రారంభం నుంచి ముగింపు వరకు వీరి సరదా సన్నివేశాలు వినోదభరితంగా ఉన్నాయి. వీరి స్నేహం, అనుబంధం ప్రేక్షకులకు చిరునవ్వులు పుట్టించేలా ఉంది. ఇదే సమయంలో కార్తీక్ ఒక అందరికంటే భిన్నంగా ఉండే పల్లవి (నయన్ సరికా) అనే అమ్మాయిని ప్రేమిస్తాడు. నార్నే నితిన్, నయన్ సరికా మధ్య కెమిస్ట్రీ అద్భుతంగా పండింది. వారి సన్నివేశాలు హాస్యాస్పదంగాను అలాగే చాలా క్యూట్ గా కూడా ఉన్నాయి. కానీ ఈ ప్రేమకథకు ఒక ట్విస్ట్ ఉంది. కార్తీక్ పల్లవిని ప్రేమిస్తే ఈ ముగ్గురు స్నేహితుల మధ్య ఏం జరుగుతుంది? కర్తీక్ తన ప్రేమ కోసం ఎలాంటి కృషి చేస్తాడు? ఈ ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకోవాలంటే ఆగస్టు 15వ తేదీ వరకు ఆగాల్సిందే. ట్రైలర్‌లో చూపించిన సరదా డైలాగులు, హాస్యసన్నివేశాలు సినిమాలో బాగానే నవ్వించనున్నాయని అర్ధమవుతుంది. స్నేహం, ప్రేమ, ఫ్యామిలీ అనే అంశాలను ఒకే కథలో చూపిస్తూ ప్రేక్షకులను అలరించేందుకు మేకర్స్ ప్రయత్నం చేస్తున్నట్లు అర్ధమవుతుంది. ఈ చిత్రంలో వినోదం, డ్రామా, భావోద్వేగాలు సమపాళ్లలో ఉన్నాయని ట్రైలర్ తో క్లారిటీ వచ్చేసింది. బన్నీ వాస్, విద్యా కొప్పినీడి నిర్మించిన ఈ చిత్రానికి ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. నూతన దర్శకుడు అంజి క మణిపుత్ర ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు.

## సంయుక్త.. నిండైన చీరలో ఎంత గ్లామరో..



సంయుక్త మీనన్ టాలీవుడ్‌లో తనకంటూ ఒక ప్రత్యేకమైన క్రేజ్ ను అందుకుంటోంది. తెలుగులో ఆమెకు "భీమ్లా నాయక్" సినిమా ద్వారా పెద్ద బ్రేక్ వచ్చింది. ఈ సినిమాలో ఆమె తన అందం, అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆ సినిమా విజయంతో, సంయుక్తకు టాలీవుడ్‌లో వరుసగా మంచి అవకాశాలు లభించాయి. "భీమ్లా నాయక్" తర్వాత సంయుక్త "బింబిసార", "సార్", "విరూపాక్ష" వంటి చిత్రాలలో నటించి బ్లాక్ బస్టర్ హిట్లు అందుకుంది. ఈ విజయాలతో సంయుక్త టాలీవుడ్‌లో ఒక గోల్డెన్ బ్యూటీగా మారిపోయింది. చాలా తక్కువ సమయంలోనే తెలుగు ప్రేక్షకులకు ఎంతో దగ్గరైంది. ప్రస్తుతం నిఖిల్ సరసన "స్వయంభూ" చిత్రంలో నటిస్తూ, మరోసారి తన ప్రతిభను నిరూపించుకోవడానికి సిద్ధంగా ఉంది. సంయుక్త టాలీవుడ్‌లో మాత్రమే కాకుండా మాలీవుడ్‌లో కూడా తనకంటూ ప్రత్యేక స్థానం ఏర్పరుచుకుంది. ఈ బ్యూటీ ఇటీవలే బాలీవుడ్‌లో కూడా అడుగు పెట్టింది. చరణ్ తేజ్ ఉప్పాలపాటి దర్శకత్వంలో రూపొందుతున్న "మహారాగ్ని" సినిమాలో కీలక పాత్ర పోషిస్తోంది. ఈ సినిమా నుంచి విడుదలైన గ్లింప్స్‌లో ఆమె కారు రేసింగ్ సీక్వెన్స్‌లో, గ్లామరస్ లుక్‌లో ప్రేక్షకులను ఆశ్చర్యపరిచింది. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా, సంయుక్త సోషల్ మీడియాలో తన ఫ్యాన్స్‌తో ఎప్పటికప్పుడు టచ్‌లో ఉంటుంది. తన ఫోటోషూట్స్ ద్వారా ఆమె గ్లామర్ షో చేస్తూ అభిమానులను అలరిస్తుంది. ఏ దుస్తులలోనైనా, అది చీరల్లోనైనా, మోడ్రన్ డ్రెస్సుల్లోనైనా, ఆమె తన అందం, క్యూట్‌నెస్‌ను ఏ మాత్రం తగ్గకుండా చూపిస్తుంది. ఈ మధ్య కాలంలో ఆమె షేర్ చేసిన గ్రీన్ కలర్ కలర్ ప్లెయిన్ శారీలో దిగిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆ ఫోటోల్లో ఆమె స్లీవ్ లెస్ బ్లౌజ్‌తో, క్రేజీ నెక్ సెట్ ధరించి స్టన్నింగ్ లుక్‌లో కనిపిస్తోంది. శారీ పైటను కాస్త పక్కకు వేసుకుని, ఎద అందాలను హైలైట్ చేస్తూ క్లాసీగా కనిపిస్తూ, మరింత గ్లామర్‌ను చూపిస్తోంది. అందం విషయంలో సంయుక్త తనకంటూ ప్రత్యేకమైన ఫ్యాన్ బేస్‌ను సొంతం చేసుకుంది. సినిమాలతో మాత్రమే కాకుండా, సోషల్ మీడియాలో కూడా తన అభిమానులను పెంచుకుంటూ, ప్రతి రోజూ కొత్త కొత్త ఫాలోవర్స్‌ను పొందుతోంది. మరి ఆమె కెరీర్ కు ఈ క్రేజ్ ఎంతవరకు హెల్ప్ అవుతుందో చూడాలి.

## స్రవంతి.. కిల్లర్ లుక్స్ కేక!

తెలుగు బుల్లితెర భామలు కూడా ఈ మధ్యకాలంలో అందంతో అందరిని ఆకట్టుకుంటున్నారు. ముఖ్యంగా యాంకర్స్ గా చేస్తున్న బ్యూటీస్ అయితే గ్లామర్ షోతో కట్టిపడేస్తున్నారు. తెలుగు బుల్లితెరపై అనసూయ మొదటిసారిగా గ్లామర్ టచ్ తో యాంకర్ గా స్టార్ ఇమేజ్ సొంతం చేసుకుంది. ఆమె తర్వాత రష్మీ గౌతమ్ కూడా గ్లామర్ బ్యూటీగా మంచి ఇమేజ్ తెచ్చుకుంది. వారి దారిలో వర్షిణి, దీపికా పిళ్ళై, విష్ణు ప్రియ లాంటి బ్యూటీస్ గ్లామర్ యాంకర్స్ గా బుల్లితెరపై అందరిని ఆకట్టుకున్నారు. వీరి దారిలో యుట్యూబ్ లో యాంకర్స్ గా కెరియర్ స్టార్ట్ చేసిన అరియనా గ్లోరీ, స్రవంతి చొక్కారపు కూడా అందరి దృష్టిని ఆకర్షించారు. సోషల్ మీడియాలో మంచి ఫేమ్ సంపాదించుకొని బిగ్ బాస్ హౌస్ లోకి ఈ బ్యూటీస్ ఎంట్రీ ఇచ్చారు. అక్కడ టాప్ కంటెస్టెంట్ లుగా విశేషమైన ఫ్యాన్ ఫాలోయింగ్ కూడా సంపాదించుకున్నారు.. బిగ్ బాస్ తో స్రవంతి చొక్కారపు మంచి పాపులారిటీ సొంతం చేసుకుంది. తరువాత హోస్ట్ గా ఈ అమ్మడు కొనసాగుతోంది.



**Publisher, Printer, Owner Bollepaka Rajesh,** H.No. 2-19/1, (v) Thatikayala, (m) Dharmasagar, Hanmakonda (Dist) Telangana State. Printed at Amulya publications & printers and graphics. Place of Publication H.No. 2-19/1, (v) Thatikayala, (m) Dharmasagar, Hanmakonda (Dist) Telangana State, Pin code : 506151. **Editor : Bollepaka Rajesh. 9493669669**
**TELTEL12273** Website : www.telanganamuchatlu.in "Mail I'd: telanganamuchatlu.in@gmail.com